RNI No : APTEL 2020/80757

www.sreeprasthanam.in

# శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక

కర్నూలు సంపుటి : 04 సంచిక : 86

బుధవారం 31-07-2024

పేజీలు :04 వెల:రూ.2.00

## వయనాడ్ ఘటనపై ప్రధాని విచారం

**మృతుల కుటుంబాలకు 2లక్షల పరిహారం**

**అండగా ఉంటామని సిఎం విజయ్‌కు హామీ**

న్యూఢిల్లీ,జూలై30: కేరళలోని వయనాడ్ జిల్లాలో ఘోర ప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. భారీ వర్షాలకు మెప్పాడి సమీపంలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం తెల్లవారుజామున కొండచరియలు విరిగిపడటంతో 70మంది వరకు మంది జలసమాధి అయ్యారు. ఈ ఘటనపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. ఈ మేరకు తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ.. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన వారు వేగంగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఘటనపై కేరళ ముఖ్యమంత్రి పనరయి విజయన్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు మోదీ తెలిపారు. ప్రస్తుత పరిస్థితి, అక్కడ సాగుతున్న సహాయకచర్యల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నట్లు చెప్పారు. కేంద్రం నుంచి అన్నివిధాలుగా సాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎక్స్ వేదికగా తెలిపారు. మరోవైపు ఈ ఘటనలో బాధిత కుటుంబాలకు మోదీ ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఈ ఘటనలో మృతి చెందినవారికి పీఎం ఎన్‌ఆర్‌ఎఫ్ కింద రూ.2 లక్షలు పరిహారం చెల్లిస్తారని ప్రధాని కార్యాలయం వెల్లడించింది. క్షతగాత్రులకు రూ.50,000 ఇవ్వనున్నట్లు ఎక్స్‌లో పేర్కొంది.

## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రధాన్యత ఉంటుంది.

**పెరుమాళ్ళ వర ప్రసాద్**

సంప్రదించవలసిన నంబర్లు

94916 28386 85220 22029

Land Line No : 08517 224194

# వయనాడ్ లో విరిగిపడిన కొండచరియలు



తిరువనంతపురం, జూలై 30: కేరళలోని వయనాడ్ జిల్లాలో కొండచరియలు విరిగిపడటంతో పెను విషాదం నెలకొంది. స్థానికుల సమాచారం మేరకు వందలాది మంది ఇంకా శిథిలాల్లో ఉన్నారు. వయనాడ్ జిల్లాలోని మెప్పాడి, ముండక్కై పట్టణం, చురాల్ మాల ప్రాంతాల్లో మంగళవారం తెల్లవారుజామున ప్రకృతి తన విశ్వరూపాన్ని ప్రదర్శించింది. కొండచరియలు విరిగిపడటంతో దాదాపు 50 మృత్యువాత పడ్డారు. ఇంకా వందల మంది శిథిలాల్లో చిక్కుకొని ఉన్నారు. వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ చెప్పినట్టు ఇప్పటి వరకు మృతి చెందినవారిలో ఒక చిన్నారి కూడా ఉన్నట్టు గుర్తించారు. 100 మంది వరకు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు శరవేగంగా సాగుతున్నాయని వీణా జార్జ్ తెలిపారు. చురల్‌మలా గ్రామం పూర్తిగా ధ్వంసమైంది. కొండచరియల్లో 400 మంది కుటుంబాలు చిక్కుకున్నాయి. ఘటనాస్థలికి వెళ్లే రోడ్డు మార్గాలు ధ్వంసం అయ్యాయి. వరదలో మృతదేహాలు కొట్టుకువస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది. వయనాడ్ లోయ ప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ అయింది.కేరళలో భారీవర్షాల బీభత్సం ఎలా ఉందో చూపే దృశ్యమిది. భీకర వర్షాలకు రైల్వేట్రాక్స్ దెబ్బతింటున్నాయి. వలతోల్ నగర్, వడకంచెరి మధ్య ఒక రైల్వేలైన్‌మీదకు వరద పోటెత్తింది. దీంతో స్టేషన్ వాచ్‌మన్ రైలును ఆపేశాడు. సహాయక చర్యల కోసం ఎయిర్‌ఫోర్స్ రంగంలోకి దిగింది. రెండు హెలికాప్టర్లు సహాయకచర్యలకు బయల్దేరాయి. మరోవైపు కేరళ అఓ పినరయ్ విజయన్ సహాయచర్యలను పర్యవేక్షిస్తున్నారు.మరోవైపు ఈ దారుణ ఘటనలో వందలాది మంది



శిథిలాల కింద చిక్కుకుపోయి ఉంటారని భావిస్తున్నారు. కేరళ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ బాధిత ప్రాంతంలో ఫైర్ ఫోర్స్ , ఔఆఖీఈ బృందాలను మోహరించినట్లు తెలిపింది. అలాగే ఎన్డీఆర్‌ఎఫ్ మరో బృందం వాయనాడ్ చేరుకుంది. సైన్యం కూడా బాధ్యతలు చేపట్టింది. సహాయక చర్యలు శరవేగంగా జరుగుతున్నాయి.

మోదీ భరోసా

వయనాడ్‌లో జరిగిన దుర్ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల పరిహారం అందజేయనున్నట్టు ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసాయం అందాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చేయూత ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. కేరళలో కొండచరియలు విరిగిపడిన ఘటన తనను కలచివేసిందని ప్రధాని మోదీ అన్నారు. ఆత్మీయులను కోల్పోయిన వారందరికీ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను అన్నారు. ప్రస్తుతం బాధితులందరినీ ఆదుకునేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌తో మాట్లాడానని, అన్ని విధాలా సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.పరిహారాన్ని కూడా ప్రధాని మోదీ ప్రకటించారు. వయనాడ్‌లో కొండచరియలు

**70కి చేరిన మృతుల సంఖ్య.. మరింత పెరిగే ఛాన్స్**

**బాధితులకు సమీప ఆస్పత్రుల్లో చికిత్స**

**సహాయక చర్యలకు అడ్డంకిగా వర్షాలు**



విరిగిపడి ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు పీఎంఎన్‌ఆర్‌ఎఫ్ నుంచి 2 లక్షల ఎక్స్ గ్రేషియా ఇస్తామన్నారు. క్షతగాత్రులకు రూ.50వేలు పరిహారం అందజేస్తామన్నారు.


రాహుల్ గాంధీగ్భ్రాంతి

కేరళలో కొండచరియలు విరిగిపడిన దుర్ఘటనపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'వయనాడ్‌లోని మెప్పాడి సమీపంలో కొండచరియలు విరిగిపడటం నన్ను తీవ్రంగా కలచివేసింది. ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను అన్నారు. ఇంకా శిథిలాల్లో చిక్కుకుపోయిన వారిని త్వరలోనే సురక్షితంగా బయటకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.కేరళ ముఖ్యమంత్రి, వయనాడ్ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడానని, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు. అన్ని ఏజెన్సీలతో సమన్వయం చేసుకోవాలని, కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని, సహాయక చర్యలకు అవసరమైన సహాయం గురించి తెలియజేయాలని కోరారు. కేంద్రమంత్రులతో మాట్లాడి వయనాడ్‌కు అన్ని విధాలా సాయం అందించాలని కోరతాను అన్నారు. సహాయక చర్యల్లో అధికార యంత్రాంగానికి సహకరించాలని యూడీఎఫ్ కార్యకర్తలందరికీ రిక్వస్ట్ చేశారు. భారీ వర్షాల ముంచెత్తడంతో ముండక్కై పట్టణంలో తెల్లవారుజామున ఒంటిగంట సమయంలో మొదట కొండచరియలు విరిగిపడ్డాయి. అక్కడ సహాయక చర్యలు చేపడుతున్న టైంలోనే చురల్ మాలలో మరో ప్రమాదం జరిగింది. సుమారు 4 గంటల ప్రాంతంలో చురల్ మాలలోని పాఠశాల సమీపంలో కొండచరియలు విరిగిపడ్డాయి. వరదబాధితుల కోసం ఏర్పాటు చేసిన శిబిరంతోపాటు సమీపంలోని ఇళ్లు, దుకాణాలన్నీ నీరు, బురదతో నిండిపోయాయి.

హెల్ప్ లైన్ కేంద్రాలు ఏర్పాటు

బాధితుల కోసం 9656938689, 8086010833 హెల్‌లైన్‌లు ఏర్పాటు చేసింది కేరళ ప్రభుత్వం. అన్ని విధాల ప్రజలకు ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించింది.


# త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ : ప్రధాని మోదీ




న్యూఢిల్లీ: 2014కు ముందు యూపీఏ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థ మెరుగ్గా ఉందని చూపేందుకు బడ్జెట్‌లో భారీ ప్రకటనలు గుప్పించేదని, క్షేత్రస్థాయిలో వాటి అమలును పట్టించుకోలేదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. వికసిత్ భారత్ దిశగా ప్రస్థానం అనే అంశంపై కేంద్ర బడ్జెట్ 2024-25పై సీఐఐ నిర్వహించిన సదస్సులో ప్రధాని ప్రారంభోపన్యాసం చేశారు. పథకాలను పూర్తి చేసేందుకు గత ప్రభుత్వాలు శ్రద్ధ కనబరచలేదని దుయ్యబట్టారు.గత పదేండ్లుగా తాము ఆ పరిస్థితిని మార్చివేశామని ప్రధాని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంతో పోలిస్తే తాము రైల్వే బడ్జెట్‌ను 8 రెట్లు పెంచామని, హైవేల బడ్జెట్‌ను 8 రెట్లు, వ్యవసాయ బడ్జెట్‌ను 4 రెట్లు పెంచామని తెలిపారు. రక్షణ బడ్జెట్‌ను రెండింతలు పైగా పెంచామని చెప్పుకొచ్చారు. యూపీఏ హయాంలో లక్షలాది కోట్ల రూపాయల విలువైన అవినీతి కుంభకోణాలు వెలుగుచూసిన విషయం అందరికీ తెలిసిందేనని అన్నారు. తాము శ్వేతపత్రం రూపంలో దేశ ఆర్థిక వ్యవస్థ ముఖచిత్రాన్ని దేశ ప్రజల ముందుంచామని చెప్పారు. మనం ఎక్కడ ఉన్నామనేదానిపై చర్చ జరగాలని చెప్పారు.భారత పరిశ్రమలను నూతన శిఖరాలకు చేర్చామని తెలిపారు. దేశ అభివృద్ధికి మూలధన వ్యయం కీలకమని 2004లో యూపీఏ తొలి బడ్జెట్‌లో మూలధన వ్యయం కేవలం రూ. 90,000 కోట్లు కాగా, ఇప్పుడు తమ ప్రభుత్వం రూ. 11 లక్షల కోట్లు పైగా మూలధన వ్యయం వెచ్చిస్తోందని ఈ నిధులతో దేశంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇవాళ మనం వికసిత్ భారత్ దిశగా పయనిస్తున్నామని, ఈ మార్పు కేవలం సెంటిమెంట్లతో రాలేదని, ఆత్మవిశ్వాసంతోనే ఇది సాధ్యమైందని అన్నారు. ప్రపంచంలో మనం ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగామని, భారత్ త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# గిరిజన మహిళల సౌకర్యం కోసం గర్భిణి వసతి గృహాలు : చంద్రబాబు


అమరావతి : రాష్ట్రంలో గిరిజన గర్భిణిలు ఇబ్బందులు పడకుండా వసతి గృహాలను ఏర్పాటు చేస్తామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. మంగళవారం అమరావతిలోని సచివాలయంలో గిరిజన సంక్షేమ శాఖపై సమీక్ష నిర్వహించారు. టీడీపీ హయాంలో చేపట్టిన గిరజన పథకాలను వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత నిర్వీర్యం చేశారని మండిపడ్డారు .ఎన్టీఆర్ విద్యోన్నతి, అంబేద్కర్ ఓవర్ సీస్ విద్యానిధి బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల పథకాలను పట్టించుకోలేదని ఆరోపించారు. గిరిజన ప్రాంతాల్లో రానున్న రోజుల్లో డోలీ మోతలు కనిపించకూడదని, ట్రైకార్, జీసీసీ,



ఐటీడీఏలను పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. గిరిజన ప్రాంతాలకు మౌలిక వసతులు కల్పించడం ద్వారా ఫీడర్ అంబులెన్స్‌లను తిరిగి ప్రవేశ పెట్టాలని సూచించారు.

# విద్యుత్ విచారణ కమిషన్ కొత్త చైర్మన్‌గా జస్టిస్ లోకూర్

హైదరాబాద్ : విద్యుత్ విచారణ కమిషన్ కొత్త చైర్మన్‌గా జస్టిస్ మదన్ భీమ్ రావు లోకూర్ నియామకం అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హైకోర్టు సీజేగా ఆయన పని చేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా కూడా జస్టిస్ లోకూర్ సేవలందించారు.బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దెబ్బకు జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి తప్పుకున్న సంగతి తెలిసిందే. తెలంగాణలో విద్యుత్ ఒప్పందాలపై ఏర్పాటు చేసిన కమిషన్ నుంచి తప్పుకుంటున్నట్టు



సుప్రీంకోర్టుకు జస్టిస్ నరసింహా రెడ్డి లేఖ పంపారు. దీంతో ఆయన స్థానంలో మరొకరి నియామకానికి అత్యున్నత న్యాయస్థానం సమయం ఇచ్చింది. ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారమే కొత్త జడ్జి నేతృత్వంలో కమిషన్ విచారణ కొనసాగించొచ్చని పేర్కొంది. ఈ మేరకు జస్టిస్ లోకూర్‌ను ప్రభుత్వం నియమించింది.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్ ఒప్పందాలపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ నర్సింహారెడ్డితో జ్యుడిషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఆ కమిషన్ విచారణను సవాల్ చేస్తూ కేసీఆర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు జులై 16న ఉదయం విచారణ చేపట్టింది. ఇరుపక్షాల తరపున సీనియర్ న్యాయవాదులు సుదీర్ఘంగా వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అభిషేక్ మనుసింఘ్వీ, సిద్ధార్థ్ లూథ్రా, కేసీఆర్ తరపున ముకుల్ రోహత్గీ వాదించారు.

# ఏపీ హైకోర్టులో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఊరట

అమరావతి : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు హైకోర్టులో ఊరట లభించింది. వాలంటీర్లపై గతంలో పవన్ కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై నమోదైన కేసులో స్టే విధించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు వాలంటీర్లపై పవన్ కల్యాణ్ తీవ్రంగా విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలో వాళ్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయనపై గుంటూరులో కేసు నమోదైంది. దీంతో ఈ కేసు క్వాష్ చేయాలని పవన్ పిటిషన్ దాఖలు చేశారు. దానిపై విచారణ జరిపిన హైకోర్టు.. ఈ కేసు మాత్రమే కాకుండా ఇలాంటి మరికొన్ని కేసులపై ప్రభుత్వం రివిజన్ చేస్తోందని కోర్టుకు అడ్వకేట్ జనరల్ తెలిపారు.




కాగా తదుపరి విచారణను హైకోర్టు నాలుగు వారాలకు వాయిదా వేసింది.మరోవైపు పల్నాడు జిల్లాలోని విజయపురి సౌత్ రేంజిలో అటవీ ఉద్యోగులపై స్మగ్లర్ల దాడిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సీరియస్ అయ్యారు. ఈ దాడిని ఖండించిన ఆయన.. పల్నాడు జిల్లా కలెక్టర్, ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. వన్యప్రాణుల అక్రమ రవాణాదారుల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఇకపై ఎవరైనా వన్యప్రాణులను అక్రమ రవాణా చేసినా.. అటవీ ఉద్యోగులపై దాడి చేసినా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

# వర్షాలతో ప్రాజెక్టులకు జలకళ

**ప్రకృతి కూడా ఆశీర్వదిస్తోంది: మంత్రి నిమ్మల**

ఏలూరు,జూలై30 : ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమిని ప్రజలు ఎంత బాగా ఆశీర్వదించారో రాష్ట్రాన్ని కూడా ప్రకృతి అదే విధంగా దీవిస్తోందని జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి ఏపీలో జలకళ సంతరించుకుందని ఆయన చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నదులు, జలాశయాలు నిండుకుండలా మారాయని మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ..'భారీగా కురిసిన వర్షాల నేపథ్యంలో శ్రీశైలం

డ్యాం ఐదు గేట్లు ఎత్తి 1.35లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నాం. నాగార్జునసాగర్ పూర్తి సామర్థ్యం 312క్యూసెక్కులకు గాను 140క్యూసెక్కుల నీరు డ్యాంలోకి చేరింది. రాయలసీమ ప్రాంతానికి తాగు, సాగునీరు అవసరాలు తీర్చే విధంగా పోతిరెడ్డి, వెలుగోడు, ఆల్మట్టి డ్యాంలు నిండాయి. హంద్రీనీవా, తుంగభద్రా నుంచి పెద్దఎత్తున వర్షపు నీరు జలాశయాలకు చేరుతోంది. హంద్రీనీవా ప్రాజెక్టు నిర్వాహక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వారం రోజుల క్రితమే గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా వారు స్పందించలేదు. ఆ అధికారుల్లో గత వైసీపీ ప్రభుత్వ పాలన వాసన పోలేదు. వారిపై త్వరలోనే కఠిన చర్యలు తీసుకుంటాం' అని అన్నారు.

# సంపాదకీయం

బుధవారం 31-07-2024

## చిత్తశుద్ధితో హామీల అమలుకు కాంగ్రెస్ కృషి !

కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నది. పక్షం రోజుల్లో రెండు విడుతల రుణమాఫీ చేపట్టింది. అలాగే అసెంబ్లీలో ప్రజాస్వామ్యయుతంగా చర్చలు సాగుతున్నాయి. గతంలో బిఆర్ఎస్ అధికారంలో ఉండగా ఏనాడూ చర్చ జరిగిన సందర్భం లేదు. ఎమ్మెల్యేలు మాట్లాడుతుండగానే మైక్ కట్ అయ్యేది. వారికి మాట్లాడే అవకాశం ఉండేది కాదు. నాలుగైదు రోజులు అసెంబ్లీ జరిపి మమ అనిపించేవారు. పద్దులను మమ అనిపించేవారు. మాట్లాడే వారికి ఛాన్స్ వచ్చేది కాదు. సస్పెండ్ చేసి బయటకు పంపేవారు. పూర్తిగా సభనుంచి బహిష్కరించి, ఇద్దరు ఎమ్మెల్యేలను అనర్హులను చేసిన ఘనత కూడా బిఆర్ఎస్ ప్రభుతత్వం దక్కించుకుంది. కానీ ఇప్పుడు అసెంబ్లీ జరుగుతున్న తీరు చూస్తుంటే మళ్లీ పాతరోజులు గుర్తుకు వస్తున్నాయి. తప్పులు చేసి, అప్పులు చేసి, జనాలకు కుచ్చుటోపీ పెట్టిన నాటి బిఆర్ఎస్ నేతలు కూడా స్వేచ్ఛగా మాట్లాడుతున్నారు. ఏడు నెలల ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారు. ఇదంతా కాంగ్రెస్ ఇచ్చిన స్వేచ్ఛగానే చూడాలి. ఓ వైపు అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగానే రెండో విడత రుణమాఫీని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టి అమలు చేసింది. భారీ కార్యక్రమం ఏర్పాటు చేసి తమ లక్ష్యశుద్దిని, చిత్తవుద్దిని చాటుకుంది. గత ఎనిమిది నెలలుగా ప్రభుత్వాన్ని గాడిలో పెట్టుకుంటూ.. గత బిఆర్ఎస్ ప్రభుత్వ తప్పిదాలపై శ్వేతపత్రాలను విడుదల చేస్తూ..హామీలను అమలు చేస్తూ సాగుతోంది. ఒక్కో హామీని నెరవేర్చుకుంటూ కాంగ్రెస్ తన ప్రధాన హామీలకు గ్యారెంటీ ఇస్తోంది. కాంగ్రెస్ హామీలకు గ్యారెంటీ వస్తోందని ప్రజలు కూడా చర్చించుకుంటున్నారు. ఒక్కో హామీని నెరవేర్చే క్రమంలో అత్యంత ముఖ్యమైన రుణమాఫీలో లక్షన్నర రుణమాఫీని ఎట్టకేలకు మంగళవారం అమలు చేశారు. అలాగే 2లక్షల రుణాలను కూడా పంద్రాగస్ట్ లోగా పూర్తి చేయాలన్న సంకల్పాన్ని ప్రకటించింది. మిగతా హామీలకు కూడా గ్యారెంటీ ఇస్తున్నారు. కాంగ్రెస్ అంటే కుమ్ములాటలు అన్న గత చరిత్రను కాలరాస్తూ సమిష్టిగా ముందుకు సాగుతున్నారు. అభివృద్ధి సంక్షేమం తమ లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఇందులో రైతురణమాఫీ కీలక అడుగుగా భావించాలి. లక్ష వరకు రుణాలను మాఫీ చేసిన రెండు వారాల్లో లక్షన్నర హామీని కూడా మంగళవారం అమలు చేశారు. ఈ క్రమంలో రైతన్నల ఖాతాల్లో మాఫీ నగదు జమ కానుంది. ఇకపోతే రుణమాఫీకి స్పష్టమైన విధానాలు ప్రకటించారు. రతుభరోసా విషయంలో కూడా స్పష్టమైన విధానాలతో ముందుకు సాగుతున్నారు. రైతురుణ మాఫీ విషయంలో ఇచ్చిన హామీని నిలబెట్టు కుంటున్న సిఎంగా రేవంత్ ముందుంటారు. అందులోనూ అర్మలకే రుణమాఫీ ఇవ్వడం ఆహ్వానించదగ్గ విషయం.కెసిఆర్ ప్రభుత్వం గతంలో ఇచ్చిన రుణమాఫీ హామీ సక్రమంగా నెరవేరలేదు. పదేళ్ల పాటు డొల్ల మాటలతో, మసిపూసి మారేడుకాయ చేశారు. అయినా ఒక్కో అవినీతి బయటపడుతున్న కొద్దీ కాంగ్రెస్‌పై ఎదురు దాడితో తమ అవినీతి, అక్రమాలను, బంధుప్రీతిని కప్పిపుచ్చుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. అసెంబ్లీ వేదికగా వారు చేస్తున్న ప్రసంగాలే ఇందుకు నిదర్శనం. విద్యుత్ కొనుగోళ్లు, ఫోన్ ట్యాపింగ్, జిఎస్టీ స్కామ్ తదితర స్కామ్‌లు బయటపడుతున్నా నోరు మెదపకుండా ఎదురుదాడి చేస్తున్నారు. ఇలా ఎదురుదాడి చేసేందుకు అసంబ్లీలో అవకాశం కల్పించిన ఘనత కూడా కాంగ్రెస్ పార్టీతదేనని చెప్పాలి. ఏపని చేసినా విమర్శలు చేయడమే పనిగా బిఆర్ఎస్ నేతలు పెట్టుకున్నారు. ఈ నెల 18న రూ.లక్ష లోపు తొలుత రుణాలు మాఫీ చేయనున్నట్లు తెలిపారు. సాయంత్రంలోగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసారు. ఇప్పుడు 30వ తేదీన లక్షన్నర రుణమాఫీని అమలు చేశారు. రెండోదశ రుణమాఫీ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. రుణమాఫీ నిధులు పక్కదారి పట్టకుండా బ్యాంకర్లకు సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో పంట రుణాల మాఫీకి ప్రభుత్వం మార్గదర్శకాల ను విడుదల చేసింది. అన్ని షెడ్యూల్డు, వాణిజ్య, ప్రాంతీయ గ్రామీణ, జిల్లా సహకార బ్యాంకుల నుంచి 2018 డిసెంబరు 12 నుంచి మంజూరైన, రెన్యువలైన రుణాలకు, 2023 డిసెంబరు 9 వరకు బకాయి ఉన్న పంట రుణాలకు, స్వల్పకాలిక రుణాలకు ఇది వర్తిస్తుందని... రుణాల అసలు, దానికి వర్తించే వడ్డీని కలిపి రూ.2 లక్షలు మాఫీ అవుతాయని ప్రభుత్వం తెలిపింది. రుణమాఫీ కోసం ప్రభుత్వం విడుదల చేసిన నిధులను ఇతర ఖాతాల్లో జమచేసుకోకుండా బ్యాంకర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. మొత్తంగా ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు పక్కాగా కార్యాచరణతో ముందుకు సాగుతున్న వేళ బిఆర్ఎస్, బిజెపిలు సన్నాయి నొక్కులు నొక్కుతూనే ఉన్నారు. గత పదేళ్లలో ఏమీ చేయలేని బిఆర్ఎస్ నేతలు, కేంద్రంలో ఇచ్చిన హామీలు నెరవేర్చని బిజెపి నేతలు ఇక్కడ మాత్రం విర్శలు చేసి పబ్బం గడుపు కోవాలని చూస్తున్నారు. అదేపనిగా తప్పుడు ప్రచారాంతో పక్కదారి పట్టించే ప్రయత్నాలు సాగిస్తున్నారు. లేదు. రైతు రుణమాఫీ పథకంలో భాగంగా మంగళవారం సాయంత్రంలోపు రైతులరుణ ఖాతాల్లో రూ.లక్షన్నర వరకు డబ్బులు జమ కానున్నాయి. ఈ మేరకు బ్యాంకర్లకు ఆదేశాలు వెళ్లాయి. ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీకి ప్రభుత్వం అడుగులు వేసింది. మొత్తం 31వేల కోట్ల రుమాఫీని పూర్త ఇచేస్తామని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకం ఆధారంగానే రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టత ఇచ్చారు. ప్రభుత్వం విడుదల చేసే నిధులను రైతు రుణమాఫీకే వాడాలి. వ్యక్తిగత, ఇతర రుణాల మాఫీకి వినియోగించవద్దని సూచనలు ఇచ్చారు. మొత్తంగా అసెంబ్లీలో ప్రజాస్వామ్యం నిలిచింది. రైతులకు ఇచ్చిన రుణ మాఫీ హామీ అమలు జరిగింది. 500 కే సిలిండర్ ఇస్తున్నారు. 200కే విద్యుత్ ఇస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్లకు కూడా శ్రీకారం చుట్టారు. అవికూడా త్వరలోనే పట్టాలకు ఎక్కనున్నాయి. ఇందుకు కాంగ్రెస్ పార్టీని అభినందించాల్సిందే. అన్నింటికి మించి పారదర్శకంగా పాలన సాగిస్తున్న రేవంత్ రెడ్డి బృందాన్ని అభినందించాల్సిందే.

## భరతమాత ముద్దుబిడ్డ,స్వాతంత్ర్య సమరయోధులు సర్దార్ ఉద్దం సింగ్

### -నేడు ఆయన బలిదాన దినోత్సవం




1919 ఏప్రెల్ 13 పంజాబ్ లోని అమృతసర్ లో జలియన్ వాలాబాగ్ అనే చిన్నతోటలో రౌలత్ చట్టానికి వ్యతిరేఖంగా శాంతియుతంగా సభ జరుపుకుంటున్న అమాయకప్రజలపై జనరల్ డయ్యర్ ఆధర్యంలో విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో దాదాపు వెయ్యిమంది మరణించారు. రెండువేలమంది క్షతగ్రాతు?లైనారు. ఇది అత్యంత ఘోరమైన సంఘటన గా చరిత్రలో మిగిలిపోయింది..ఆ రోజు ఆ సభలో మంచినీరు సరఫరా చేయడానికి ఒక అనాధశరణాలయం నుండి 19 యేండ్ల కుర్రాడు వచ్చాడు.. జరిగిన దురంతం చూసి చలించిపోయాడు. నేలమీదపరుండి ప్రాణాలు కాపాడుకున్న ఆ కుర్రాడు..శవాల గుట్టలను చూసి కోపంతో వణికిపోయాడు.. కంటినిండానీరు ఉబికివస్తుండగా ఆ తోటలోని రక్తం అంటినమట్టిని తీసుకొని "ఈ దురంతానికి కారకుడైన వ్యక్తులను చంపేదాకా నేను చావను"అంటూ ప్రతిజ్ఞ చేశాడు. దీనికి కారకులైన డయ్యర్స్ ను వెతుకుంటూ బయలుదేరాడు. తుపాకీ కాల్చుడం నేర్చుకున్నాడు. కొన్నిరోజులు భగత్ సింగ్ తో కలిసి విప్లవకార్యక్రమాలలో పాల్గొన్నాడు..డయ్యర్స్ లో ఒకరైన ఫ్రాన్సిస్ డయ్యర్ 1927లో భారత్ లోనే చనిపోయాడు. దానితో జనరల్ ఓ డయ్యర్ ను చంపేందుకు ఇంగ్లండ్ పయనమవ్వాలనుకుంటున్న సమయంలో భగత్ సింగ్ తో పాటు ఆయనను అరెస్ట్ చేశారు.తన కళ్ళముందే భగత్ సింగ్ ను ఉరితీయడం చూసి హతాసుడైనాడు..1932లో విడుదలైన తర్వాత ఇంజనీరింగ్ చదవాలని ఇంగ్లండ్ పయనమైనాడు. పేరు మార్చుకుంటూ జనరల్ ఓ డయ్యర్ ను వెంటాడసాగాడు.. దీనికోసం చాలా కష్టాలు పడ్డాడు. ఆకలితో నిద్రలేని ఎన్నో రాత్రులు గడిపాడు.ఒకరోజు ఓ డయ్యర్ ఒక కాన్ఫరెన్స్ కు హాజరుకాబోతున్నట్లు సమాచారం అందిందతనికి. ఎంతో కష్టపడి ఎంట్రీ పాస్ సంపాదించాడు...ఒకపుస్తకంలో ఫిస్టల్ పట్టేటట్లు కాగితాలను కత్తించి అందులో దానిని దాచాడు..ఏమీ ఎరగనట్లు ఓ డయ్యర్ సభకు వెళ్ళాడు...సభలో ఓ డయ్యర్ ను వీరుడు,ధీరుడంటూ పొగిడేస్తున్నారు...అది వింటున్న ఆ యువకుడి రక్తం సలసలలాడసాగింది. జలియన్ వాలా బాగ్ లో అమాయకుల ఆర్తనాదాలు గుర్తుచ్చాయి..రక్తమడుగులో గిలగిలకొట్టుకుంటూ ప్రాణాలిడుస్తున్న అభాగ్యులు గుర్తుకొచ్చారు..ఇంతలో డయ్యర్ ప్రసంగం ముగిసింది...ఆయనను అభినందించాడానికి జనాలు ఆయన దగ్గరకు వెళుతున్నారు. ఆ యువకుడి కూడా గంభీరంగా లేచి పుస్తకం చేతబట్టుకొని డయ్యర్ దగ్గరకు వెళుతున్నాడు...నిశితంగా గమనిస్తున్న ఓ డయ్యర్ ఆ యువకుడి వేషధారణను చూసి ఏదో గుర్తుకొస్తున్నట్లు అనిపించి అప్రమత్తమయ్యే లోపలే పుస్తకంలోని పిష్టల్ మెరుపువేగంతో తీయడం,అంతే వేగంతో ఓ డయ్యర్ పై గుళ్ళ వర్షం కురిపించడం జరిగిపోయింది..జనరల్ ఓ డయ్యర్ నేలకొరిగాడు..ఎవరినైతే నా బానిసలు..వారి ప్రాణాలు నేను పెట్టిన బిక్ష అంటూ జలియన్ వాలాబాగ్ కాల్పుల తర్వాత గర్వంగా అన్నాడో...ఆ సంఘటనలోని వ్యక్తి చేతిలోనే ప్రాణాలు విడిచాడు.ఇది 1940 జూలై 13న జరిగింది.ఓ.డయ్యర్ ను చంపిన తరువాత ఈయనను చంపడానికే నేను ఇన్నిరోజులు బతికాను.ఇంక నన్ను ఏమైనా చేసుకోండి అంటూ లొంగిపోయాడాయువకుడు... ఇంతకీ ఆ యువకుడి పేరేమిటో తెలుసా???? షంషేర్ ఉద్దామ్ సింగ్ ....ఆ విప్లవవీరుడి వర్ధంతి సందర్భంగా.. అమర వీరునికి నమః సుమాంజలి!!!ఉద్దమ్ సింగ్ పంజాబ్ లోని సంగ్రూర్ జిల్లా లోని సునం తెహసీల్ కు చెందిన కలన్ గ్రామంలో డిసెంబర్ 26 1899 నజన్మించాడు.1940 జూలై 31 (వయసు 40) కారాగారము, యునైటెడ్ కింగ్డమ్ లో ఉరితీయబడ్డారు.కోర్టులో ఉదంసింగ్ ప్రసంగం:నేనే చేశాను ఈ హత్య ఎందుకు అంటే అతని మీద నాకు పగ నేను అతనిని చంపే అంత తప్పు చేసాడు నా దెశ ప్రజల ఆత్మ ను భంగపరచాడు అందుకనే వాడిని చంపి వేసాను అందుకోసం 21 సం!! లు వేచి చూసాను నేను ఈ పని చేసినందుకు సంతోషంగా ఉన్నాను నేను మరణంకు భయపడలేదు. నేను నా దేశం కోసం మరణిస్తున్నాను.

## ఆంధ్రకు రానున్న 20 వేల కోట్లు

విజయవాడ, జూలై 30, కేంద్ర ఆర్థికశాఖ వర్గాలు చెప్పిన అంచనాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు 15వేల కోట్ల నుంచి 20వేల కోట్ల వరకూ వచ్చే అవకాశం ఉంది. బిహార్‌కు 5 నుంచి 10వేల కోట్ల సాయం అందనుంది. ఈ రెండు రాష్ట్రాలకు ఇచ్చిన ప్రత్యేక కేటాయింపుల వల్ల ఈసారి కేంద్ర ఖజానాపై 25వేల నుంచి 30వేల కోట్ల రూపాయల భారం పడనుందని ఆర్థిక శాఖ చెబుతోంది. 'రాష్ట్రాల అభ్యర్థనలపై అందించే ప్రత్యేక సాయం' పద్దు కింద ఏపీ, బిహార్‌కు సాయం అందించే అవకాశం ఉంది. ఈ పద్దుకు ఈసారి బడ్జెట్‌లో 20 వేల కోట్లు కేటాయించారు. ఎన్నికలకు ముందు ప్రవేశ పెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో ఈ హెడ్ కింద కేటాయింపులు 4వేల కోట్లు మాత్రమే. ఏవైనా రాష్ట్రాలు ప్రత్యేక అవసరాలు ఉంటే వారి కోరిక మేరకు ఈ పద్దు నుంచి కేటాయింపులు చేస్తుంది కేంద్రం. ఎన్నికల తర్వాత ఈ పద్దుకు కేటాయింపులు ఏకంగా 5 రెట్లు పెరగడం చూస్తుంటే.. ఈ ఖాతా ద్వారానే ఈ రెండు రాష్ట్రాలకూ సాయం అందించన్నారని అర్థం అవుతోంది. 2023-24 బడ్జెట్ లో రాష్ట్రాలకు సాయం కింద పద్దులో రూ.2,271 కోట్లు ప్రతిపాదించగా.. చివరికి రూ.13,000 కోట్లు సాయం అందించింది కేంద్రం. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ లో కేవలం 4 వేలు పేర్కొనగా, పూర్తి స్థాయి బడ్జెట్ లో మాత్రం ఆ ప్రత్యేక సాయం పద్దను రూ.20,000 కోట్లకు కేంద్రం నిర్ణయం తీసుకుందని తెలుస్తోంది. కిందటి వారం నిర్మలా సీతారామన్ బడ్జెట్ పద్దులో ఎక్కువగా వినిపించిన రాష్ట్రాల పేర్లు ఆంధ్ర, బిహార్. ఇంతకు మందు చాలా ఏళ్లుగా ఆంధ్రప్రదేశ్ అనే పేరే బడ్జెట్‌లో వినిపించేది కాదు. ఈసారి పలుమార్లు నిర్మల ఈ పేరును ప్రస్తావించారు. అమరావతికి ప్రత్యక ఆర్థిక తోడ్పాటు కింద 15వేల కోట్ల సమీకరణ, ఏపీలో వెనుకపడిన జిల్లాల ప్రత్యేక ప్యాకేజీ, పోలవరం ప్రాజెక్టుకు అయ్యే ఖర్చుపై పూర్తి బాధ్యత తీసుకోవడం, వైజాగ్ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్లోని కొప్పర్తి నోట్‌కు మౌలిక సదుపాయాలు కల్పించడం, హైదరాబాద్-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లోని ఓర్వకల్లుకు రోడ్లు, తాగునీరు వంటి సౌకర్యాలకు నిధులు కేటాయింపు వంటివి ప్రస్తావించారు. అలాగే బిహార్‌కు 27వేల కోట్ల విలువైన కూడా హైవేలు, విమానాశ్రయాలు మౌలిక వసతుల కల్పనా ప్రాజెక్టులు ప్రకటించారు.ఎన్డీఏ 3.0 ప్రభుత్వానికి ఇప్పుడు ఊపిరి ఇస్తున్న పార్టీలు టీడీపీ, జనతాదళ్ యునైటెడ్ లే. మైనార్టీలో ఉన్న ఈ బీజేపీ ప్రభుత్వానికి ఈ రెండు పార్టీలకు చెందిన 28 మంది ఎంపీల మద్దతు దన్నుగా నిలబడుతోంది. కాబట్టి రాజకీయ పరమైన కారణాలతో ఈ రెండు రాష్ట్రాలకు కేటాయింపులు చేశారని విమర్శలు వచ్చాయి. తెలుగుదేశం ప్రభుత్వం మాత్రం తమకు ప్రత్యేక సాయం ఏమీ అందించడం లేదని చెబుతోంది. ఏపీ పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకే సాయం అందిస్తున్నారని ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. విభజన వల్ల నష్టపోయిన రాష్ట్రానికి సాయం అవసరం అంటున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం విడుదల చేసిన శ్వేతపత్రంలో ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి అదనంగా రూ.19,107 కోట్లు అవసరం అని పేర్కొన్నారు. పోలవరం, వెనుకబడిన జిల్లాల సాయం వంటివన్నీ చట్టంలోనే ఉన్నాయని.. రాజధానికి కేంద్రం సాయం చేస్తామని పదేళ్ల కిందటే చెప్పిందని టీడీపీ నేతలు గుర్తు చేస్తున్నారు.

## మౌనాన్నే నమ్ముకున్న వైసీపీ లీడర్లు



విజయవాడ, జూలై 30, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో మంత్రులు, మాజీ మంత్రులు, ఇతర సీనియర్ల బలగం కనీసం యాభై మంది వరకూ ఉంటారు. పార్టీ ఓడిపోక ముందు వీరు తరచూ మీడియా ముందుకు వచ్చి మాట్లాడేవారు. ఇప్పుడు ఒకరిద్దరు తప్ప ఎవరూ కనిపించం లేదు. జిల్లాల్లో కనీసం పార్టీ క్యాడర్ కూ కనిపించడం లేదని చెబుతున్నారు. పార్టీ కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలని పిలుపునిస్తున్నా చాలా మంది స్పందించడం లేదు. కొంత మంది తప్పనిసరిగా పార్టీ ఆఫీసుకు, కార్యక్రమాలకు వస్తున్నా నోరు తెరవడం లేదు. కొత్త ప్రభుత్వంపై అప్పుడే విమర్శలు ఎందుకుని చాలా మంది అనుకుంటున్నారు. వైసీపీ ఓటమి చిన్నది కాదు. ముఖ్యంగా శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకూ సీనియర్ నేతలు అనే ట్యాగులున్న వారు కూడా వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. మరోసారి పార్టీకి భవిష్యత్ ఉందా లేదా అన్న స్థాయిలో ఫలితాలు వచ్చాయి. ఉత్తరాంధ్ర వైసీపీ లో కింగులుగా ఉన్న ధర్మాన, బొత్స వంటి వారు ఘోరంగా ఓడిపోయారు. వారే కాదు.. కంచుకోటల్లాంటి నియోజకవర్గాల్లో పరాజయం పాలయ్యారు. ఉత్తరాంధ్రలో కూటమి నేతలకు వచ్చిన మెజార్టీలు చూస్తే.. తమ ఐదేళ్ల పాలనపై ప్రజలు ఎంత ఆగ్రహంతో ఉన్నారో వైసీపీ ముఖ్యులకు అర్థమయింది. అందుకే వీలైనంత వరకూ సైలెన్స్ పాటించడం మంచిదని అనుకుంటున్నారు. ఇప్పటికిప్పుడు ఆవేశపడి ప్రయోజనం లేదని అనుకుంటున్నారు. వైసీపీ హయాంలో నోరున్న నేతలకు మంచి పలకుబడి ఉండేది. చాలా మంది ప్రెస్ మీట్లు పెట్టి దడదడలాడించేవారు. రోజా దగ్గర నుంచి కొడాలి నాని వరకూ ఓ పది మంది ఇలాంటి ప్రెస్ మీట్లకు ప్రసిద్ధి. ఇప్పుడు అడపాదడపా పేర్ని నాని, గుడివాడ అమర్నాథ్ మాత్రమే ప్రెస్ మీట్ పెడుతున్నారు. వినుకొండలో జరిగిన హత్యాయత్నం ఘటనపై గుంటూరుకు చెందిన నేతలెవరూ ప్రెస్ మీట్ పెట్టలేకపోయారు.. విశాఖలో ఉన్న గుడివాడ అమర్నాత్ ఆ బాధ్యత తీసుకోవాల్సి వచ్చింది. ఓడిపోయినప్పటి నుంచి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఎవరికీ కనిపించలేదు. బడ్జెట్ పై శ్వేతపత్రం తర్వాత హఠాత్తుగా హైదరాబాద్ లో ప్రత్యక్షమైన ప్రెస్ మీట్ పెట్టారు. మిగిలిన నేతలు ఆ మాత్రం దర్శనం కూడా ఇవ్వకపోతూండటంతో వైసీపీ క్యాడర్ కూడా కంగారు పడుతోంది. వైసీపీ హయాంలో టీడీపీ నేతల్ని.. వ్యక్తిగత శత్రువులుగానే చూశారు. ఎక్కడ అవకాశం దొరికి అక్కడ కేసులు పెట్టి అరెస్టులు చేశారు. ఆస్తుల విధ్వంసం చేశారు. వారాంతాల్లో బుల్‌డోజర్లతో విరుచుకుపడేవారు. ఇలాంటి పరిణామాలతో ఐదేళ్ల పాటు టీడీపీ నేతలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. మాకు అధికారం అందితే మీ సంగతి చూస్తామంటూ టీడీపీ నేతలు ఎన్నో సార్లు హెచ్చరించారు. ఇప్పుడు వైసీపీ ఘోర పరాజయం పాలు కావడంతో... వారిని రెచ్చగొట్టడం ఎందుకన్న ఉద్దేశంలో ఎక్కువ మంది సీనియర్ నేతలు సైలెంట్ గా ఉన్నట్లుగా భావిస్తున్నారు. వీరిలో ఎంత మంది పార్టీలో ఉంటారో.. ఎంత మంది ఉండరో కూడా స్పష్టత ఉండటం లేదు. ఏ పార్టీలో చాన్స్ లేకపోయినప్పటికీ గుంటూరులో ఇప్పటికే ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు గుడ్ బై చెప్పారు. జగన్మోహన్ రెడ్డి వ్యవహార శైలి టీడీపీని మరింత రెచ్చగొట్టేలా ఉండటంతో.. అది ఆయన కన్నా పార్టీ నేతలకే ఎక్కువ ముప్పు వచ్చేలా ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇప్పటికే పీకల్లో సమస్యల్లో మునిగిపోయి ఉంటే.. ఆయన ఎప్పుడై యాభై ఏళ్ల కిందట చంద్రబాబును కొట్టారని అదే కోపమని.. సరికొత్త రూమర్ ను ప్రచారంలోకి తీసుకు వచ్చారు. ఇది పెద్దిరెడ్డికి మరింత సమస్యగా మారనుంది. వైసీపీ ముఖ్యనేతలు ఇప్పటికిప్పుడు గతంలో తాము చేసిన వ్యవహారాలకు సంబంధించి తమను తాము కాపాడుకోవడమే కీలకమన్నట్లుగా ఉన్నారు. లఅందుకే ఎవరూ పెద్దగా నోరు తెరవడం లేదని.. ముందుకు రావడం లేదని అంటున్నారు.

## ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు గడువును ఆగస్టు 31 వరకు పెంచండి.. సీబీడీటీకి ఏఐఎఫ్‌టీపీ వినతి

న్యూఢిల్లీ:2024-25 అసెస్‌మెంట్ సంవత్సరానికి ఆదాయపు పన్ను రిటర్న్‌లను దాఖలు చేయడానికి గడువును ఆగస్టు 31 వరకు పొడిగించాలని ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ టాక్స్ ప్రాక్టీషనర్స్ (ంఎఈఖ) సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్ (అఃఆ)ని కోరింది. పలు రాష్ట్రాల్లో వరదలు రిటర్న్ ఫైలింగ్ ప్రక్రియపై తీవ్ర ప్రభావం చూపాయని ఏఐఎఫ్‌టీపీ జాతీయ అధ్యక్షుడు నారాయణ జైన్, నారాయణ్ జైన్, డైరెక్ట్ ట్యాక్స్ రిప్రజెంటేషన్ కమిటీ చైర్మన్ ఎస్‌ఎం సురానా పేర్కొన్నారు. ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్‌లో కొండచరియలు విరిగిపడడంతో ఈ కష్టాలు మరింతగా పెరిగాయన్నారు. ఆదాయపు పన్ను పోర్టల్, సాఫ్ట్‌వేర్‌లో సమస్యలు ఉన్నాయని, వివిధ ఫారమ్‌లను డౌన్‌లోడ్ చేయడం, ధ్రువీకరణలో ఇబ్బందులు ఉన్నాయని ఓ మెమోరాండంలో పేర్కొన్నారు. అదే సమయంలో బ్యాంకుల ద్వారా సెల్ఫ్ అసెస్‌మెంట్ పన్ను చెల్లింపు, చలాన్‌లను డౌన్‌లోడ్ చేసే ప్రక్రియకు సైతం సమయం పడుతుందని తెలిపారు.ఇదిలా ఉండగా వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు 2024-25 అసెస్‌మెంట్ ఇయర్‌కు సంబంధించిన ఐటీఆర్ దాఖలు చేసేందుకు ఈ నెల 31తో గడువు ముగియనున్నది. గడువులోగా ఐటీఆర్ దాఖలు చేయకపోతే జరిమానా విధించే అవకాశం ఉన్నది. ఈ క్రమంలో ఐటీఆర్‌ను ఫైల్ చేయడంలో సాంకేతిక సమస్యలు, ఇతర అవాంతరాల నేపథ్యంలో ఆదాయపు పన్ను చెల్లింపుదారులు గడువు పొడిగించాలని కోరుతున్నారు. అయితే, ఈ విషయంలో ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన చేయలేదు. గడువులోగా ఐటీఆర్ దాఖలు చేయలేకపోతే ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 234ం జరిమానా, వడ్డీ సైతం చెల్లించాల్సి రానున్నది. అదనంగా సెక్షన్ 234ఎఫ్ లేట్ ఫీజును సైతం విధిస్తుంది. ఆదాయాన్ని బట్టి రూ.1,000 నుంచి రూ.5వేల జరిమానా విధించే ఛాన్స్ ఉంది. అంతే కాకుండా పలు తగ్గింపులు, మినహాయింపులను క్లెయిమ్ చేసే అవకాశాన్ని కోల్పోయే ప్రమాదం ఉంటుంది.




## మనీలాండరింగ్ కేసులో మాజీ మంత్రికి ఊరట..

### నవాబ్ మాలిక్‌కు బెయిల్ ఇచ్చిన సుప్రీంకోర్టు

మనీలాండరింగ్ కేసులో ఎన్‌సీపీ నేత, మహారాష్ట్ర మాజీ మంత్రి నవాబ్ మాలిక్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఆరోగ్య సమస్యల నేపథ్యంలో ఆయనకు బెయిల్‌ను మంజూరు చేసింది. కిడ్నీ వ్యాధితో పాటు పలు సమస్యలతో బాధపడుతున్నానంటూ మాలిక్ బాంబే హైకోర్టును ఆశ్రయించారు. రెగ్యులర్ బెయిల్‌పై హైకోర్టు ఆదేశాలు ఇచ్చే వరకు ఉపశమనం కొనసాగుతుందని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. ఆరోగ్య సమస్యలతో బాంబే హైకోర్టు బెయిల్‌ను నిరాకరించడంతో ఈ నెల 13న నవాబ్ మాలిక్ సుప్రీం కోర్టు తలుపుతట్టారు. బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూ ర్తులు జస్టిస్ బేల ఎం త్రివేది, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారించి బెయిల్‌ను మంజూరు చేసింది. గ్యాంగ్‌స్టర్ దావూద్ ఇబ్రహీం, అతని సహచరులతో సంబంధాల కేసులో ఫిబ్రవరి 2022లో నవాబ్ మాలిక్‌ను ఈడీ అరెస్టు చేసింది. గత ఎనిమిది నెలలుగా మాలిక్ ఆరోగ్యం క్షీణిస్తో?ందని.. దీర్ఘకాలిక కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నారని న్యాయవాది అమిత్ దేశాయ్ హైకోర్టులో వాదనలు వినిపించారు. అయితే, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లుగా.. కిడ్నీ సరిగా పని చేయడం లేదని సూచించే వైద్య నివేదికలు సూచించలేదని హైకోర్టు పేర్కొంది.



## గ్రౌండ్ వర్క్ లో కృష్ణతేజ

కాకినాడ, జూలై 30,ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పెషల్ రిక్వెస్ట్ మీద ఏపీకి వచ్చిన కేరళ కేడర్ ఐఏఎస్ మైలవరపు కృష్ణతేజ గ్రౌండ్ వర్క్ షురూ చేశారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాలతో కృష్ణతేజ రంగంలోకి దిగారు. పిఠాపురంలో సమస్యలు తెలుసుకునేందుకు ఏపీ పంచాయతీరాజ్, రూరల్ డెవలప్మెంట్ డైరెక్టర్ కృష్ణతేజ డిప్యూటీ సీఎం నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. గ్రామాల్లో తాగునీరు, రోడ్లు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని పవన్ కళ్యాణ్ ఇదివరకే స్పష్టం చేశారు. గ్రామాల్లో సమస్యలపై ఫోకస్ చేసి, వారికి చేరువ అయి కష్టాలు తీర్చడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని పేర్కొన్నారు. అందులో భాగంగా ఐఏఎస్ కృష్ణతేజ ప్రధానంగా తాగునీటి సమస్య పై దృష్టిసారించారు. పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరంలో చెరువులో కలుషిత నీటి సమస్యపై ఫోకస్ చేశారు. చుట్టూ గోదావరి ఉన్నా, తాగేందుకు గుక్కెడు సురక్షితమైన మంచి నీళ్లు లేక అల్లాడిపోతున్న ఏకే మల్లవరం గ్రామస్తుల సమస్య తెలుసుకునేందుకు అక్కడికి వెళ్లారు కృష్ణతేజ. మల్లవరంలో చెరువుకు వెళ్లే దారి సైతం మొత్తం బురదతో నిండిపో యింది. అసలే వర్షాలు పడటంతో మురుగు పెరిగింది, మరోవైపు దుర్వాసన వస్తున్నా యువ ఐఏఎస్ కృష్ణతేజ ఆ బురదలోనే నడుచుకుంటూ వెళ్లి చెరువును పరిశీలించారు కృష్ణతేజ. చెరువు నిండా గుర్రపు డెక్క ఉండటంతో పాటు కలుషితంగా మారిన నీటిని తాగొద్దని గ్రామస్తులకు ఆయన సూచించారు. త్వరలోనే మల్లంచెరు చెరువు సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

# జగన్ అక్రమాలపై ఉక్కుపాదం

అమరావతి,జూలై30 : ఎపిలో టిడిపి కూటమి ప్రభుత్వం దూకుడు ప్రదర్శిస్తోంది. ఓ వైపు అవినీతిపై యుద్ధం చేస్తూనే..గత ప్రభుత్వ అరచకాలను బయటపెడుతూనే..అభివృద్ధిలో కీలక అడుగులు వేస్తోంది. అభివృద్ధి , సంక్షేమాన్ని కొనసాగిస్తూ..జగన్ అవినీతపై అంకుశం దింపుతోంది. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి మాటున జరిగిన అవినీతి జరిగిన అవినీతి, అక్రమాల దోపిడీలు.. అంతకుమించి అనేలా పెరిగిపోయాయని గుర్తించింది. జగన్ ప్రభుత్వంఅవినీతిలో కూరుకుపోయిన అంశాలపై దృష్టి సారించింది. అందుకు బాధ్యులెవరో తేల్చే పనిలో పడింది. చంద్రబాబు సర్కార్ దూకుడుగా ముందుకెళ్తుండటంతో అక్రమార్కుల గుండెల్లో గుబులు పట్టుకుంది. ప్రభుత్వం మారాక దస్త్రాల దగ్ధం ఘటనలు ఇందుకు నిదర్శనం. అక్రమాలు లేకుంటే దస్త్రాలను దహనం చేయాల్సిన పనిలేదు. చంద్రబాబు ప్రభుత్వం మాత్రం.. నిజాలు నిగ్గు తేల్చేందుకు విచారణకు ఆదేశిస్తోంది. మద్యం అక్రమాలపై సీఐడీ విచారణ.. మదనపల్లి దస్త్రాల దగ్ధంపై దర్యాప్తు.. టీడీఆర్ బాండ్లపైనా ఏసీబీ ఎంక్వైరీ.. రఘురామ కుట్ర ఫిర్యాదుపై విచారణ వేగవంతం.. ఇలా ఏపీలో అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం సంచలన నిర్ణయాలతో ముందుకెళ్తోంది. ఎక్కడ అవినీతి జరిగిందని అనుమానం వచ్చినా.. ఎవరు ఆరోపణలు చేసినా.. ఆఖరికి కుట్ర కోణం జరిగిందని అనుమానం ఉన్నా విచారణకు ఆదేశిస్తోంది. తప్పు చేసిన వారిని వదిలేదేలే అని హెచ్చరిస్తోంది.ప్రభుత్వం మారింది.. మంత్రులంతా రివ్యూలతో ఆఫీస్‌లకే పరిమితమ య్యారు. ఆ సమయంలో కృష్ణాజిల్లా యనమలకుదురు కట్టపై ప్రభుత్వ రికార్డులు తగలబెట్టిన ఘటన సంచలనం రేపింది. స్థానికులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కొంతమందిని పోలీసులకు అప్పగించారు. పీసీబీ,

### అవినీతిని వెలికితీసే ప్రయత్నాల్లో బాబు
### దర్యాప్తులతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు

మైనింగ్ ఫైళ్లు కాలి బూడిదయ్యాయి. ఉన్నపళంగా కట్టపై ఎందుకిలా చేశారన్నది అంతుబట్టలేదు. యనమలకుదురు కట్టపై ఫైళ్ల దగ్ధం ఘటన మరువకముందే.. మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంటలు చెలరేగాయి. రాత్రి పదకొండున్నర గంటల సమయంలో జరిగిన ఈ ఘటనలో కీలక కంప్యూటర్లు, దస్త్రాలన్నీ కాలిపోయాయి. దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఆర్డీవో హరి ప్రసాద్‌తో పాటు 37 మంది సిబ్బందిని అదుపులోకి తీసుకుని విచారించారు. కాల్‌డేటాపైనా ఆరాతీశారు. చుక్కల భూములు, 22ఏ ల్యాండ్స్, రిజర్వాయర్లకు సంబంధించిన భూములు, అసైన్మెంట్ ల్యాండ్స్‌కి సంబంధించిన రికార్డులన్నీ భద్రంగా ఉన్నాయా? లేదా? అన్నది తేల్చే పనిలో పడ్డారు. సెలవు రోజున ఎవరి ప్రమేయంతో.. ఎందుకిలా చేశారన్నది మిస్టరీగా మారింది. ఈ ఎపిసోడ్‌పై డీజీపీ, సీఐడీ చీఫ్‌తో సహా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడుతో పాటు డీఎస్పీలు, సీఐలతో కేసు వివరాలపై ఆరా తీస్తున్నారు. ప్రభుత్వం మారిన వెంటనే ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు గుంటూరులోని నగరం పాలెం పోలీసుల్ని ఆశ్రయించారు. గత ప్రభుత్వ హయాంలో రాజద్రోహం చట్టం కింద అరెస్టు చేసి వేధించారని ఆరోపించారాయన. మాజీ సీఎం జగన్‌తో పాటు అప్పటి సీఐడీ డీజీ పీవీ సునీల్‌కుమార్, మరికొందరు అధికారులపై ఫిర్యాదు చేశారు. 2021 మే 14న తనపై హత్యాయత్నం చేశారని.. రబ్బర్ బెల్ట్, లాఠీలతో కొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రఘురామ నుంచి ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు.. హత్యాయత్నం, తప్పుడు నివేదికలు, భయభ్రాంతులకు గురిచేయడం లాంటి అంశాలకు సంబంధించి వేర్వేరు సెక్షన్లు పెట్టారు. వీటిలో బెయిల్‌బుల్, నాన్‌బెయిల్‌బుల్ సెక్షన్లు కూడా ఉన్నాయి. సిఐడి అధికారులపైనే కేసులు నమోదు చేయడం రాష్ట్ర వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. ఇక వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం అక్రమాలపై ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించింది. లోతైన విచారణ తరువాత ఈడీకి కూడా సిఫార్సు చేస్తామని.. అసెంబ్లీ వేదికగా ప్రకటించారు సీఎం చంద్రబాబు. మద్యం అక్రమాలపై అసెంబ్లీలో ప్రజంటేషన్ ద్వారా వివరించారు. వ వైసీపీ నేతలు దోచుకుతిన్నారని ఆరోపించారు. పేదవాడి బలహీనతను ఆసరగా చేసుకుని నాణ్యత లేని లోకల్ బ్రాండ్లు తీసుకొచ్చారన్నారు. వాటిని విచ్చలవిడిగా విక్రయించి.. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడారని మండిపడ్డారు. మద్యం అక్రమాలపై సీఐడి విచారణలో ఏం తేలనుందన్నది ఆసక్తిగా మారింది. ఇదే అసెంబ్లీలోనే టీడీఆర్ బాండ్లపైనా చర్చ జరిగింది. రాష్ట్రంలో 2019 నుంచి 24 వరకూ 3306 టీడీఆర్ బాండ్స్ ఇచ్చారని.. దీనిపై శాఖాపరమైన చర్యలు, ఏసీబీ విచారణకు ఆదేశించామన్నారు మంత్రి నారాయణ. తణుకు పురపాలక సంఘంలో 61 బాండ్లు జారీ చేశారు. టీడీపీ హాయాంలో 6000 గజాలకు మాత్రమే బాండ్లు ఇచ్చారని గుర్తు చేశారు టీడీపీ ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ. గతంలో సంవత్సర కాలంలోనే లక్ష, 48వేల 400 గజాలు వరకూ బాండ్లు ఇచ్చారన్నారు. జగనన్న కాలనీ పేరుతో 25 కోట్లకు బాండ్లు ఇష్యూ చేశారన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో సూత్రధారి ఎవరో తేల్చడంతో పాటు అధికారులపైనా చర్యలు తీసుకోవాలని రాధాకృష్ణ డిమాండ్ చేశారు.

# కృష్ణమ్మ ఒడిలో సంగమేశ్వరాలయం

### ఏటా వర్షాకాలంలో నీట మునగడం ఆనవాయితీ

కర్నూలు,జూలై30(ఆర్ఎన్ఎ): పాండవులచే ప్రతిష్టించినట్లు ప్రచారం జరుగుతున్న సప్త నదుల సంగమేశ్వర స్వామి జలాదివాసం అయ్యారు. ఎగువన ఉన్న కర్ణాటక, మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణా నదికి వరద నీరు పోటెత్తుతోంది. సుమారు రెండు లక్షల క్యూసెక్కుల వరద నీరు వస్తుండటంతో సంగమేశ్వరం వద్ద కృష్ణమ్మ పరవళ్ళు తొక్కుతోంది. దీంతో నీటి మట్టం పెరగడంతో సంఘమేశ్వరాలయం లోని వేపదారు శివలింగమును కృష్ణా జలాలు తాకాయి . కర్నూలు జిల్లా నల్లమల అటవీ ప్రాంతంలోని లలితా సంగమేశ్వరుడు కృష్ణమ్మ ఒడికి చేరుకున్నాడు. సంగమేశ్వరాలయం గత ఏడాది డిసెంబర్ 11వ తేదీ శ్రీశైల జలాశయం కృష్ణా జలాల్లో నుండి బయటపడింది. తిరిగి ఇప్పుడు జులై 23వ తేదీ ఆలయం ప్రాంగణంలో నీళ్లు వచ్చి స్వామి గర్భలయంలోకి ప్రవేశించాయి. దాదాపు 258 రోజులు పాటు భక్తులకు దర్శనమించిన వేపదారు శివలింగాన్ని కృష్ణ జలాలు తాకాయి. గంగమ్మకు చీర సారే సమర్పించి గర్భాలయంలోని వేపదారు శివలింగం కు ఈ సంవత్సరానికి చివరి పూజలు నిర్వహించిన ప్రత్యేక పూజలు చేశారు ఆలయ ప్రధాన అర్చకులు. గత సంవత్సరం జూలై 30వ తేదీ గర్భాలయంలోకి నీళ్లు రాగా డిశంబరు 11వ తేదీ ఆలయం బయటపడి భక్తులకు దర్శనమిచ్చిన సంగమేశ్వరుడు. డిసెంబర్ 11 నుండి నేటి వరకు దాదాపు 258 రోజులు పాటు భక్తుల పూజల అందుకున్నారు సప్త నదుల సంగమేశ్వరుడు. ప్రతి సంవత్సరం ఎనిమిది నెలలు నీళ్లల్లో ఉండి నాలుగు నెలలు మాత్రమే బయటపడే ఆలయం ఈసారి 8 నెలలు బయట ఉండడం విశేషం. మళ్ళీ స్వామి వారి దర్శనం ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 840 అడుగుల నీటిమట్టం ఉండగా ఈ నీటిమట్టం 85క్ష అడుగులకు చేరుకుంటే సంఘమేశ్వర ఆలయం పూర్తిగా కృష్ణమ్మ ఒడిలోకి వెళ్లనుంది. మళ్లీ స్వామి అమ్మవార్ల దర్శనం కలగాలంటే 8 నెలలు వేచిచూడాలి భక్తులు. సంగమేశ్వరాలయం ఆలయం విశేషం ఏమిటంటే.. ఈ ఆలయం ఎక్కువ రోజులు శ్రీశైలం ప్రాజెక్టు నీటిలో మునిగివుంటుంది. మరో విషయం ఏమిటంటే వేల సంవత్సరాల క్రితం సంగమేశ్వరాలయంలో ప్రతిష్టించిన వేపలింగంను భీముడు ప్రతిస్టించాడని పురాణాలు చెబుతున్నాయి. వేపదారు శివలింగం ఇప్పటికీ చెక్కుచెదరకపోవడం భక్తులను ఆశ్చర్యచకితులను చేస్తోంది.

# నెల రోజుల పాటు పుష్కరిణి మూసివేత

తిరుమల, జూలై 30, (న్యూస్ పల్స్)తిరుమలకు వెళ్లే శ్రీవారి భక్తులు.. స్వామి వారి దర్శనానికి ముందు శ్రీవారి పుష్కరిణిలో (కోనేరు) స్నానం చేయడం ఆనవాయితీ. తలనీలాలు సమర్పించిన భక్తులతో పాటుగా ఇతర భక్తులు కూడా కోనేట్లో స్నానం చేసి శ్రీవారిని దర్శించుకుంటూ ఉంటారు. అయితే ఆగస్ట్ ఒకటో తేదీ నుంచి నెల రోజుల పాటు మీకు ఆ భాగ్యం దక్కకపోవచ్చు. తిరుమల శ్రీవారి ఆలయం వద్ద ఉన్న పుష్కరిణిని ఆగస్ట్ 1 నుంచి 31వ తేదీ వరకూ మూసివేయనున్నారు. ఈ నెల రోజుల పాటు శ్రీవారి భక్తులకు కోనేట్లో స్నానం చేసేందుకు వీలుండదు. ఈ విషయాన్ని టీటీడీ ఓ ప్రకటనలో తెలిపింది.శ్రీవారి పుష్కరిణిలో ఉన్న నీటిని పూర్తిగా తొలగించి, పైపులైన్ల మరమ్మతులు, సివిల్ పనులు చేసేందుకు నెల రోజుల పాటు పుష్కరిణిని మూసివేయనున్నట్లు టీటీడీ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ నేపథ్యంలో నెల రోజులు పుష్కరిణి హారతి కార్యక్రమం ఉండదని తెలిపింది. శ్రీవారి పుష్కరిణిలో నీటిని నిల్వచేయరు. ఈ నీటిని శుద్ధి చేసి మళ్లీ ఉపయోగించుకునేందుకు రీసైక్లింగ్ వ్యవస్థను సైతం ఏర్పాటు చేసుకున్నారు. ఇక నిరంతరంగా నీటిని శుద్ధి చేస్తూ వినియోగిస్తూ ఉంటారు. అయితే శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా నెలరోజులు కోనేటిని మూసివేసి మరమ్మత్తులు చేపడుతూ ఉంటారు. ఇందులో భాగంగా మొదటి పది రోజులు కోనేట్లోని నీటిని తొలగిస్తారు. ఆ తర్వాత పదిరోజుల పాటు మరమ్మత్తులు చేపడతారు. ఆఖరి పదిరోజుల్లో నీటిని నింపే కార్యక్రమం ఉంటుంది. ఈ మొత్తం పనులను టీటీడీ వాటర్ వర్క్స్ విభాగం చేపడుతూ ఉంటుంది.కోదండరామస్వామి పవిత్రోత్సవాలకు అంకురార్పణతిరుపతిలోని కోదండరామస్వామి ఆలయ పవిత్రోత్సవాలకు మంగళవారం సాయంత్రం అంకురార్పణ చేశారు. జులై 31 నుంచి ఆగస్ట్ 2 తేదీ వరకూ మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు.ప్రతి ఏడాది మూడు రోజుల పాటు ఆలయంలో పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు పవిత్ర ప్రతిష్ట, రెండో రోజు పవిత్ర సమర్పణ, మూడో రోజు వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయి. ఉత్సవాల్లో పాల్గొనాలనుకునే భక్తులు రూ.500 చెల్లించి పవిత్రోత్సవాల్లో పాల్గొనవచ్చని టీటీడీ తెలిపింది.

# దసరా తర్వాతే మద్యం కొత్త పాలసీ...



విజయవాడ, జూలై 30, ఆంధ్రప్రదేశ్ కొత్త మద్యం పాలసీ అమల్లోకి రావడానికి మరికొన్ని నెలలు సమయం పట్టనుంది. ప్రస్తుత మద్యం పాలసీ గడువు 2024 అక్టోబర్ వరకు ఉండటంతో న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా అప్పటి వరకు పాత విధానాన్నే కొనసాగించాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది.ఆంధ్రప్రదేశ్‌లో గత ఐదేళ్లుగా మద్యం వ్యాపారాన్ని నేరుగా ప్రభుత్వమే నిర్వహిస్తోంది. వైసీపీ హయంలో మద్యం విక్రయాల్లో అక్రమాలు జరిగాయని టీడీపీ ఆరోపిస్తోంది. మద్యం పాలసీలో అక్రమాల మాటటుంచితే గత ఐదేళ్లలో ప్రభుత్వం అమ్మిన బ్రాండ్లను మాత్రమే జనం కొనాల్సి వచ్చేది. ఊరుపేరు లేని బ్రాండ్లతో పాటు దేశంలో ఎక్కడా లేని మద్యం బ్రాండ్లు ఏపీలో మాత్రమే విక్రయించేవారు.నాసిరకం మద్యం, డిస్టిలరీల్లో తయారై నేరుగా దుకాణాలకు చేరిపోయే మద్యంపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చినా వైసీపీ ప్రభుత్వం వాటిని ఖాతరు చేయలేదు. సంపూర్ణ మద్య నిషేధం అంటూ అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ ఐదేళ్లలో మద్యంపై వచ్చే ఆదాయాన్ని రెట్టింపు చేసింది. మద్యం ధరల్ని గణనీయంగా పెంచేసి విక్రయాలు జరిపారు. 2019మే నాటి ఉన్న ధరలతో పోలిస్తే 2024నాటికి అవి దాదాపు రెట్టింపు అయ్యాయి.తాము అధికారంలోకి వస్తే నాణ్యమైన మద్యం అందిస్తామని, ధరలు కూడా తగ్గిస్తామని, టీడీపీ, జనసేనలు ఎన్నికల ప్రచారంలో ప్రకటించాయి. ఏపీ మద్యం విక్రయాలపై విచారణ జరిపిస్తామని బీజేపీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఎన్డీఏ కూటమివ అధికారంలోకి వచ్చిన వెంటనే మద్యం ధరలు తగ్గుతాయని, అన్ని పాపులర్ బ్రాండ్లు అందుబాటులోకి వస్తాయని జనం భావించారు. ఎన్నికల సమయంలో వైసీపీ "జే " బ్రాండ్లను తొలగిస్తామని విస్తృతంగా ప్రచారం చేశారు.ప్రస్తుత మద్యం పాలసీ గడువు అక్టోబర్ వరకు ఉండటంతో ఇదే పాలసీ మరో మూడు నెలలు కొనసాగే అవకాశం ఉంది. ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన లిక్కర్ పాలసీని కొనసాగిస్తున్నారు. దీంతో గత ఐదేళ్లలో విక్రయాలు జరిపిన మద్యం బ్రాండ్లే ఇంకా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అమ్మకాలు చేస్తున్నారు. కొత్త మద్యం పాలసీ రూపకల్పనలో ఎక్సైజ్ శాఖ తలమునకలై ఉన్నట్టు తెలుస్తోంది.కొత్త మద్యం పాలసీపై లిక్కర్ సిండికేట్లు కన్నేశాయి. ఐదేళ్లుగా మద్యం విక్రయాల ద్వారా వచ్చిన ఆదాయం చాలా వరకు ప్రభుత్వ ఖజానాకు చేరింది. ప్రభుత్వం విక్రయించిన మద్యం నాణ్యత, ధరలపై ఎన్ని విమర్శలు ఉన్నా మద్యం ద్వారా లభించిన ఆదాయం మాత్రం గణనీయంగా పెరిగింది.ఏపీలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొత్త లిక్కర్ పాలసీ ప్రవేవపెడుతుందనే వార్తల నేపథ్యంలో లిక్కర్ సిండికేట్లు జోరుగా ప్రయత్నాలు మొదలు పెట్టాయి. మద్యం దుకాణాలను దక్కించుకోడానికి సిండికేట్లు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఐదేళ్లుగా ప్రభుత్వమే నేరుగా మద్యాన్ని విక్రయించడంతో ఆదాయాన్ని కోల్పోయిన వ్యాపారులు, రాజకీయ నాయకులు, డిస్టిలరీలు కుమ్మక్కై కొత్త పాలసీని ప్రభావితం చేసే ప్రయత్నాలు చేస్తున్నారు.ఏపీలో మద్యం విక్రయాలను మించిన ఆదాయ మార్గం ప్రభుత్వానికి మరొకటి లేదు. ఏటా రూ.36వేల కోట్ల రుపాయల ఆదాయం ఖజానాకు లభిస్తోంది. ఇందులో నాలుగో వంతు ఉత్పాదక వ్యయంగా పోయినా దాదాపు రూ.27వేల కోట్ల రుపాయలు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయంగా లభించేది. 2019కు ముందు మద్యం ద్వారా ప్రభుత్వానికి సమకూరిన ఆదాయంలో మద్యం దుకాణాలు కూడా భారీగానే లాభపడ్డాయి.అధికారంలోకి వచ్చిన వెంటనే మద్యం ధరల్నివైసీపీ గణనీయంగా పెంచేసింది. 2019 ధరలకు రెండు రెట్లు ధరలు పెంచడంతో వినియోగదారులు ఇతర మార్గాలను అన్వేషించారు. పొరుగు రాష్ట్రాల నుంచి భారీగా అక్రమ మద్యం రవాణా అయ్యేది. అక్రమ రవాణా నిరోధంతో పాటు నాటుసారా తయారీని అరికట్టడానికి సెబ్ పేరిట ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇవేమి ప్రభుత్వం ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. ఫలితంగా మద్యం ధరల్ని కొంత తగ్గించారు. అయితే నాణ్యత విషయంలో తీవ్ర విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది.

ప్రభుత్వ మద్యం దుకాణాలు..

2019కు ముందు మద్యం విక్రయాల ద్వారా వచ్చే ఆదాయంలో చాలా భాగం రాజకీయ నాయకుల జేబుల్లోకి వెళ్లిపోయేది. మద్యం వ్యాపారాన్ని ప్రభుత్వమే చేపట్టడం ద్వారా రాష్ట్రానికి మేలు జరిగింది. గతంలో మద్యం తయారీ దారులు, విక్రయదారులు, లీజుదారులు, రాజకీయ నాయకులు సిండికేట్‌గా ఏర్పడి మద్యం దుకాణాలను తమ గుప్పెట్లో పెట్టుకునే వారు. 2019 నుంచి వీటికి అడ్డుకట్ట పడింది.వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన పాలసీలో లాభనష్టాలు రెండూ ఉన్నాయి. ప్రభుత్వమే నేరుగా మద్యం విక్రయించే విధానం చాలా కాలం క్రితమే ఢిల్లీ, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో ఉంది. ఢిల్లీలో ఇటీవల లిక్కర్ పాలసీ స్కామ్ రాకముందు వరకు సమర్ధవంతంగా ప్రభుత్వ దుకాణాల వ్యవస్థ నడిచేది.

# సీఎంకు కత్తిమీద సామే....

తిరుపతి, జూలై 30, నాలుగోసారి ముఖ్యమంత్రి అయిన నారా చంద్రబాబుకు ఈసారి పరిపాలన అంత సులువుగా సాధ్యమయ్యేటట్లు కనిపించడం లేదు. విభజన ఆంధ్రప్రదేశ్ ను ఈ దఫా గట్టును పడేయటం చంద్రబాబుకు కత్తిమీద సామే అవతున్నట్లు కనపడుతుంది. ఆయన నోటి నుంచి వెలువడే మాటలను బట్టి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం అంత సులువైన పని కాదు. సూపర్ సిక్స్ ను అమలు చేయాలంటే సాధ్యమయ్యే పని కాదని ఆయన ఏపీ అప్పుల చరిత్రను చూసిన తర్వాత నిజం తెలిసి ఉండవచ్చు. కానీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పర్చకపోతే రాజకీయంగా ఇబ్బందులు తప్పవు. అందుకే ఆయన తన అనుభవాన్నంతా ఉపయోగించి దీని నుంచి బయట పడేస్తారని సహచర మంత్రులతో పాటు పార్టీ ఎమ్మెల్యేలు కోరుకుంటున్నారు. సూపర్ సిక్స్ తో పాటు ఎన్నికల్లో వివిధ రకాలుగా ఇచ్చిన హామీలను అమలు చేయాలంటే ఏడాదికి లక్షన్నర కోట్ల రూపాయలు కావాల్సి ఉంటుంది. ఇంత పెద్ద మొత్తంలో ఇప్పటికిప్పుడు ఆదాయం రూపంలో వచ్చే అవకాశం కనిపించడం లేదు. మరో వైపు కేంద్ర ప్రభుత్వం చంద్రబాబు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ అక్కడ ఉన్నది మోదీ. అంత తేలిగ్గా మింగుడు పడదు. అర్థం కాదు. ఆ విషయం చంద్రబాబుకు కూడా తెలుసు. అలాగని కేంద్రంతో కయ్యానికి కూడా ఆయన సిద్ధంగా లేరు. ఎందుకంటే ఇప్పటికి గెలిచిన 1999, 2014, 2024 ఎన్నికల్లో బీజేపీతో పొత్తుతోనే గెలుపు సాధ్యమయిందని ఆయన మరవరు. మరవకపోవచ్చు. ఇప్పటికిప్పుడు బీజేపీపై కాలు దువ్వి సాధించిందేమీ లేదన్నది కూడా ఆయనకు తెలియంది కాదు. అందుకే ఆచి తూచి అడుగులు వేయడమే మంచిదన్న భావనలో ఉన్నారు. కేంద్రాన్ని నొప్పించకుండా ఒప్పించడమే చంద్రబాబు ముందున్న లక్ష్యం. చంద్రబాబుకు ప్రధానంగా ఈసారి రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడం ప్రధమ కర్తవ్యం. ఆ రెండు పూర్తయితే చరిత్రలో చంద్రబాబు పేరు చిరస్థాయిలో మిగిలిపోతుంది. అందుకే ఆయన ఫోకస్ అంతా ఆ రెండింటిపైనా ఉంటుంది. అందులో ఎవరూ తప్పుపట్టడానికి కూడా లేదు. ఎందుకంటే నాలుగోసారి ముఖ్యమంత్రి అయిన ఆయన మదిలో కీర్తి కాంక్ష కాస్తంత ఎక్కువగానే ఉంటుంది. ఇప్పటికీ సైబరాబాద్ నిర్మాణం గురించి తాను చెప్పుకోగలుగుతున్నారంటే అది నాటి తన ముందు చూపు అని జనం కూడా గుర్తించగలుతున్నారు. అయితే ఈ రెండు ప్రాజెక్టులు పూర్తి కావాలంటే అంత ఈజీ కాదు. ఎందుకంటే వేల కోట్ల రూపాయలు అవసరమవతాయి. దానికి సంబంధించి ఆయన ఆందోళనలో అర్థముంది. సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు ఐదేళ్లు పార్టీ క్యాడర్ పడిన ఆర్థిక కష్టాల నుంచి బయటపడేయాల్సిన బాధ్యత కూడా ఆయనపై ఉంది. ఎందుకంటే మొన్నటి ఎన్నికల్లో తెగించి పోరాడిన కార్యకర్తలను ఈసారి పక్కన పెట్టకూడదన్నది ఆయన నిర్ణయం. అందుకే కార్యకర్తలు, నేతల అవసరాల కోసం ఆయన ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. ఇక నియోజకవర్గాల్లో గత ఐదేళ్లుగా అభివృద్ధి లేక సమస్యలు తిష్టవేశాయి. వాటిని కూడా పరిష్కరించాల్సిన బాధ్యత ఉంది. అందులోనూ ఈసారి కూటమి తరుపు 164 మంది ఎమ్మెల్యేలు విజయం సాధించి వచ్చారు. వీరిందరు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో ప్రధాన సమస్యల్లో కొన్నింటినైనా పరిష్కరించగలిగితేనే గత పాలనకు, తన పాలనకు మధ్య తేడా చూపించగలుగుతారు. కానీ ఇప్పుడున్న ఏపీ ఆర్థిక పరిస్థితిని చూసిన వారికి ఎవరికైనా ఇది సాధ్యమేనా? అన్న అనుమానం సహజంగా కలుగుతుంది. అందుకే చంద్రబాబు తన అనుభవాన్ని రంగరించి ఏపీని ఎలా అభివృద్ధి పథం వైపు పరుగులు పెట్టిస్తారన్నది మాత్రం చూడాల్సిందే?

# ఆర్టీసీకి మరో 1325 బస్సులు....

హైదరాబాద్, జూలై 30, (న్యూస్ పల్స్) తెలంగాణలో ప్రజా రవాణా వ్యవస్థకు పెరుగుతున్న ప్రయాణికుల తాకిడి నేపథ్యంలో మరిన్ని బస్సు సర్వీసులను తీసుకువచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. గత కొన్నాళ్లుగా ప్రభుత్వ బస్సుల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికులు సంఖ్య గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం మహిళలకు అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం పథకం తరువాత కొన్ని రకాల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా అధిక సంఖ్యలో మహిళలు ప్రయాణాలు సాగించడం, అదే సమయంలో పురుషులు, విద్యార్థులు, ఇతరులు సాగించే ప్రయాణాలకు అనుగుణంగా బస్సులు సరిపోకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో బస్సుల్లో పెరిగిన రద్దీను తట్టుకునేందుకు అనుగుణంగా టీజీఎస్‌ఆర్టిసి కొత్త బస్ సర్వీసులను ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది.కొత్త బస్సులు కావాలన్న టీజీఎస్‌ఆర్టీసీ అభ్యర్థన మేరకు జూన్ నాటికి 1325 కొత్త బస్సులను దశలవారీగా తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేసింది. అయితే వీటిలో ఇప్పటి వరకు ఆర్టీసీకి చేరిన బస్సుల సంఖ్య అతి స్వల్పం. ఈ నేపథ్యంలో ప్రభుత్వాన్ని మరోసారి టీజీఎస్‌ఆర్టిసి నూతన బస్ సర్వీసులు అందించాల్సిందిగా విజ్ఞప్తి చేసింది. ఈ విజ్ఞప్తి మేరకు కొద్ది రోజుల్లోనే ప్రభుత్వం నూతన బస్సు సర్వీసులను అందించేందుకు అనుగుణంగా ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వాన్ని అందించాలని కోరిన 1325 బస్సుల్లో 712 పల్లె వెలుగులు, 400 ఎక్స్ప్రెస్, 75 డీలక్స్, 138 లహరి, రాజధాని బస్సులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటిలో ఇప్పటికే కొన్ని బస్సులు అందుబాటులోకి రాగా, మిగిలిన బస్సులు కొద్ది రోజుల్లోనే టీజీఎస్‌ఆర్టీసీ చేతికి అందం ఉన్నట్లు చెబుతున్నారు. వీటిలో కొన్ని బస్సులను మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకానికి వినియోగించనున్నారు. గత కొద్ది నెలలుగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికులు సంఖ్య గణనీయంగా పెరిగినట్లు టీజీఎస్‌ఆర్టిసి అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నగర పరిధిలో ఆర్టీసీ బస్సుల్లో ప్రతిరోజు వేలాదిమంది ప్రయాణాలు సాగిస్తున్నారు. బస్సుల సంఖ్య తక్కువగా ఉండడం ప్రయాణికులు సంఖ్య అధికంగా ఉండడంతో చాలామంది ప్రమాదకర స్థాయిలో ప్రయాణాలు సాగిస్తున్నారు. ఈ తరహా ప్రయాణాలు ప్రమాదకరంగా పరిణమించే అవకాశం ఉన్న నేపథ్యంలో వీటికి చెక్ చెప్పేందుకు అధికారులు సిద్ధపడుతున్నారు.నూతన ఆర్టీసీ బస్సులను అందించాల్సిందిగా ఆర్టీసీ అధికారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# సర్కారీ ఉద్యోగులకు జీతాల టెన్షన్

### ఆగస్టు 1వ తేదీ గడిచేది ఎలా

విశాఖపట్టణం, జూలై 30 (న్యూస్ పల్స్)ఏపీలో టీడీపీ కూటమి అత్యధిక మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. వై నాట్ వన్ సెవంటీ ఫైవ్ ప్రభుత్వాన్ని 11 సీట్లకే పరిమితం చేసి..ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేసింది. తెలుగు తమ్ముళ్లు అంబరాన్నంటిన సంబరాలు చేసుకున్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో పండుగలా టీడీపీ కూటమి గెలుపు ను ఆస్వాదించారు. టీడీపీ నేత చంద్రబాబు ఫుల్ హ్యాపీ. కట్ చేస్తే చంద్రబాబు ప్రభుత్వానికి ఏపీ సమస్యల తోరణంతో స్వాగతం పలికింది. ఒక పక్క రాజధాని లేదు..పోలవరం పూర్తి కాలేదు. మరో పక్క ప్రభుత్వానికి ఆదాయం వచ్చే మార్గం మూసుకుపోయింది. గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కట్టుకోవడానికే ఈ ఐదేళ్లు సరిపోయేలా ఉంది.ఖర్చులు నియంత్రించుకుంటూనే ఆదాయం పెంచుకుంటూ పోవాలి. అలాగని వచ్చీ రాగానే ట్యాక్సులు, కరెంట్ ఛార్జీలు పెంచితే ప్రజాగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుంది. వైసీపీ పాలనలో దాదాపు 9.74 లక్షల కోట్లు అప్పులు పేరుకుపోయాయి. దాదాపు ప్రభుత్వ ఆస్తులన్నీ కూడా తాకట్టులోనే ఉన్నాయి. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వానికి అసలైన టాస్క్ ఆరంభమవబోతోంది. అది కూడా ఆగస్టు 1 రూపంలో. మొన్నటి ఎన్నికలలో చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు అమలుచేస్తామని ప్రజలకు స్పష్టమైన హామీ ఇచ్చారు. అందులో భాగంగా నెలనెలా పెన్షన్లు సమయానికి అందించాలి. వైసీపీ పాలనలో మూడు వేల పెన్షన్ కాస్తా నాలుగువేలకు పెంచుతామని వాగ్దానం చేశారు చంద్రబాబు అది కూడా ఈ ఆర్థిక సంవత్సరంనుంచి ఇస్తామన్నారు. ఆ లెక్కన చూసుకుంటే ఏప్రిల్ నుంచి నెలకు వెయ్యి చొప్పున మొత్తం మూడు నెలలకు మూడు వేలు కలిపి ఆగస్టు పెన్షన్ తో కలిపి దాదాపు రూ.7 వేల పెన్షన్ అందించాల్సి ఉంటుంది. పైగా ఇదే నెలలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కూడా అందజేస్తామని అన్నారు. అలాగే నిరుద్యోగ భృతి ఇవన్నీ కూడా తప్పనిసరిగా ఆగస్టు నుంచే అమలు చేయాల్సి ఉంటుంది.ఇక ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తారీఖున జీతాలు వెయ్యవలసి ఉంటుంది. జగన్ సర్కార్ ప్రభుత్వ ఉద్యోగులను అలక్ష్యం చేసినందునే మొన్నటి ఎన్నికలలో ఓటమి చవిచూడాల్సి వచ్చింది. ఉద్యోగుల జీతాలే పెద్ద సమస్య అనుకుంటే ప్రభుత్వ ఉద్యోగంలో రిటైర్ అయినవారికి ఇవ్వాల్సిన గ్రాడ్యుటీ, పెన్షన్ పెద్ద సమస్యగా మారింది. ఇవేగాకుండా దివ్యాంగులకు, వివిధ సంక్షేమ కార్యక్రమాల అమలుకు రూ.కోట్లలో నిధులు సమకూర్చుకోవాల్సి వస్తుంది. కేంద్రం ఇచ్చే నిధులు సమీకరించుకోవడాకిని సమయం పడుతుంది. ఈ ఆగస్టు గండం గడిచేదెలా అని నేతలు తలలు పట్టుకుంటున్నారు. వచ్చీ రాగానే జీతాలు లేట్ చేస్తే ప్రతిపక్ష హోదాలో జగన్ మామూలుగా రభస చేయడు. టీడీపీ ప్రభుత్వాన్ని ఎండగట్టేందుకు సిద్ధంగా ఉన్నాడు. ఎక్కడెక్కడ ప్రభుత్వ నిరర్ధక భూములు ఉన్నాయో ఇంకా లెక్క తేలలేదు. కనీసం వాటిని అమ్మైనా నిధులు సమకూర్చుకోవచ్చు. ఆ అవకాశం కూడా లేదు.అయితే ఇప్పటికిప్పుడు ఈ గండం నుంచి బయటపడాలంటే ఒకటే మార్గం. రిజర్వ్ బ్యాంక్ వద్ద సెక్యూరిటీ డిపాజిట్ల రూపంలో కనీసం నాలుగయిదు వేల కోట్లు సమీకరించుకోగలిగితే ఆగస్టు సంక్షోభం నుంచి బయటపడొచ్చు అని సలహాలు ఇస్తున్నారు.తెలుగు దేశం పార్టీలో ఆగస్టు నెలలో తీవ్రమైన ఆటంకాలు వచ్చిపడ్డాయి. ఎన్టీఆర్ హయాం నుంచి కూడా ఆగస్టు నెలలోనే ఏదో ఒక అనర్థం జరుగుతోంది. ఇది ఆగస్టు సంక్షోభం అని కొందరు అంటుంటే..ఇదేదో పెద్ద సమస్య కాదు..బాబు తలుచుకుంటే ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు తమ సర్కార్ కు పెద్ద సమస్యే కాదంటున్నాయి పార్టీ శ్రేణులు.

# తెరుచుకున్న శ్రీశైలం జలాశయం గేట్లు

శ్రీశైలం,శ్రీశైల జలాశయం గేట్లు తెరుచుకున్నాయి.ఎగువన కురిసిన భారీ వర్షాలకు శ్రీశైలం డ్యాం పూర్తి స్థాయిలో నిండుకుంది.ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు గాక ప్రస్తుతం 880 అడుగులు దాటింది..పూర్తిస్థాయి నీటిమట్టం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 180 టీఎంసీలకు చేరింది.దీంతో డ్యాం మూడు గేట్లను 10 అడుగులా మేర ఎత్తి దిగువకు నీటిని డ్యాం అధికారులు,ఇరిగేషన్ అధికారులు విడుదల చేశారు. మూడు గేట్లను ఎత్తి సుమారు 80వేల క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న నాగార్జున సాగర్ కు నీటిని విడుదల చేశారు.

# పెద్దమ్మకు ప్రత్యేక పూజలు.



దొర్నిపాడు,జూలై:30, శ్రీ ప్రస్థానం న్యూస్:- మండలం లోనీ డబ్ల్యు. గోవిందిన్నే గ్రామంలో వెలసిన శ్రీ మూల పెద్దమ్మ,కు మంగళ వారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామునే మహిళలు పుణ్య స్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకుని గాజులు,నిమ్మకా యలు, పట్టు వస్త్రాల తో అలంకరించి కొబ్బరి కాయలు కొట్టి కుంకుమార్చనలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు తలారి శ్రీను, శంకరయ్య, చిన్న పెద్దన్న, చిన్నన్న, లు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.. భక్తుల సౌకర్యార్థం టిక్కెట్,ప్రసాదం, కొరకు ప్రత్యేక కౌంటింగ్ ను ఏర్పాటు చేశారు..

## అగ్ని బాధితులకు జనసేన అండ రూ10 వేల ఆర్థిక సహాయం పంపిణీ.

### బాధితులకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు.



నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో శనివారం సంభవించిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు జనసేన పార్టీ అండగా ఉంటుందని జనసేన నాయకులు రూ 10 వేల ఆర్థిక సహాయము అందజేశారు. మంగళవారం ఆళ్లగడ్డ నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జి ఇరిగెల రాంపుల్లారెడ్డి, జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఇరిగెల సూర్యనారాయణ రెడ్డి ఆదేశాల మేరకు అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధితులు తుడుం ప్రహ్లాదుడు కుటుంబ సభ్యులకు పదివేల రూపాయల నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ఇంచార్జి నాగ లింగమయ్య గౌడ్. నాయకులు ఎద్దుల చంటి ఓబయ్య, మాదం బన్నీ, గుర్రప్ప, విజయ్, జంబులయ్య, బాలస్వామి, సుంకయ్య, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 50 వేల ఆర్థిక సహాయం చెక్కును అందించిన మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి.

శ్రీ ప్రస్థానం-గడివేముల:- జులై 31:- గత కొద్ది రోజుల క్రితం మండల పరిధిలోని ఓండుట్ల గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల దాడిలో గాయపడిన గంజెర్ల రవీందర్ రెడ్డి కి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి అందించిన 50 వేల రూపాయల ఆర్థిక సహాయం చెక్కును బాధితుడు రవీందర్ రెడ్డి భార్యకు మంగళవారం పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకోసం పోరాడే వాళ్ళను రోడ్డు ఎక్కకుండా ఒక రెడ్ బుక్కు పెట్టుకున్నారని ఎవరైనా రెడ్ బుక్కు లో ఉంటే వాళ్ళను ఇబ్బంది పెట్టడం వాళ్లపై దాడులు చేయడం వంటివి చేస్తున్నారన్నారు .దాడులతో భయపెట్టి చేసే రాజకీయాలు సరికాదని సూచించారు. ఇచ్చిన హామీలను ఎలాగూ అమలు చేసే పరిస్థితి లేదు కాబట్టి, గొడవలు పెట్టి, భయపెట్టాలని చూస్తున్నారన్నారని అన్నారు.





# కొరవడిన మౌలిక వసతులు.

### కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు.





నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-మండల పరిధిలోని మాచినేని పల్లె ప్రభుత్వ పాఠశాలలో కొరవడిన మౌలిక వసతులు. సరైన కనీస మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో అధికారులు ఆ పాఠశాలను నాడు నేడు నిధుల కింద ఎంపిక చేసి నిధులను కేటాయించారు. అయితే ఆ పనులను ప్రారంభించి అర్ధాంతరంగా నిలిపివేశారు. ప్రధానంగా ఆ పాఠశాలలో బాత్రూంల, మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా ఉంది. గతంలో ఉన్న పాఠశాల మరుగుదొడ్లు, బాత్రూంలు శిలావస్థమై అప్పుడా, ఇప్పుడా అన్నట్టు కూలేల, సరైన తలుపులు లేక గడియలు లేక అస్తవ్యస్తంగా ఉన్నాయి. అత్యవసర సమయాల్లో బాలికలు మరుగుదొడ్లకు వెళ్ళవలసిన సమయంలో వారు పడుతున్న బాధలు వర్ణణాతీతం. సరైనా తలుపులు లేక సరైనా గడియలు లేకపోవడంతో ఒకరు మరుగుదొడ్డి లోపలికి వెళితే ఇద్దరూ లేక ముగ్గురు విద్యార్థులు బయట కాపలా ఉండవలసిన పరిస్థితి ఉంది. ఇలా ఒకరి తర్వాత మరియొకరు కాలకృత్యాలు తీర్చుకోవలసి ఉండగా అక్కడే ఉన్న ఉపాధ్యాయులు, నాయకులు ఏ మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఆ పాఠశాలలో కనీస మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# పాఠశాలలో శిక్షా సప్తాహ్ వారోత్సవాలు.





దొర్నిపాడు, జూలై:30, శ్రీ ప్రస్థానం న్యూస్:-పాఠశాలలో విద్యార్థులు చదువుతో పాటు అన్ని అంశాల పై విజ్ఞానాన్ని అందిచడంతో పాటు సామాజిక బాధ్యత పెంచే విధంగా ఇటీవలే విద్యాశాఖ నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది..శిక్షా సప్తాహ్ అనే పేరు తో మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో గల పాటశాల్లోని విధ్యార్థులకు జూలై 22 నుంచి 29 వరకు ఏడు రోజుల పాటు వివిధ రకాల అటల పోటీలు ఆడించడం తో పాటు విజ్ఞాన్ని పెంపొందించేలా చేపట్టినా సాంస్కృతిక కార్యక్రమాలు సోమవారం తో ముగియనున్న నేపథ్యంలో టిడిపి జాతీయ అద్యక్షులు మన రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు గౌ శ్రీ నారా చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి ఐ.టి. మరియు విద్యా శాఖ మంత్రి, శ్రీ నారా లోకేష్,లు నూతనంగా ప్రవేశ పెట్టిన శిక్షా సప్తహ్ కార్యక్రమం లో భాగంగా చివరి రోజున తుది భోజనం ఏర్పాటు చేయాలన్న కోరిక మేరకు మండలం లోనీ చాక రాజు వేముల గ్రామంలోని ఎంపిపి పాటశాల మెయిన్, ఉర్దూ, బి.సి స్పెషల్, పాటశాలలో చదివే విద్యార్థులకు పాఠశాల స్టల దాత గ్రామ వడ్లమూడి చలమయ్య చౌదరి, మల్లేశ్వర చౌదరి, గ్రామ నాయకులు లింగుట్ల అరుణ వెంకట నాయుడుల దంపతులు, మరియు లింగట్ల రమణయ్య, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు శ్రీనివాసుల పాల్గొని ఆయా పాఠశాలల విద్యార్థులకు మంచి పౌష్టికాహారం తో కూడిన మధ్యాహ్న భోజనం లోబాగంగా వారంలో ఒక రోజూ అరటి పండు, స్వీట్లు అందించనున్నట్లు తెలిపారు..పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు.. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కోట ఉన్నత పాఠశాల లో పొగాకు నిర్మూలన కార్యక్రమం




నందికొట్కూరు :=నందికొట్కూరు పట్టణంలోని స్థానిక బైరెడ్డి నగర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల కోట నందు "టోఫీ"(టొబాకో ఫ్రీ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్) 9అంశాల అమలు కార్యక్రమము లో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు పొగాకు నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల సైన్సు ఉపాధ్యాయులు సాలమ్మ , మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు సలీం భాష మాట్లాడుతూ పాఠశాలలను ప్రభుత్వం పొగాకు రహిత విద్యాలయాలుగా మార్చేందుకు తీవ్రంగా కృషి చేస్తుందని,పాఠశాలకు 300 అడుగుల లోపల పొగాకు ఉత్పత్తులు అమ్మడం నిషేధం అని పేర్కొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి సైన్స్ ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థుల కు మత్తు పదార్థాలు అనగా బీడీ, సిగరెట్, తంబాకు ,గంజాయి వంటి పొగాకు సంబంధిత ఉత్పత్తుల వల్ల జరిగే ఆరోగ్య నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో చైతన్యము కలిగించడమే ప్రభుత్వ ముఖ్యఉద్దేశ్యం అనిపేర్కొన్నారు. అలాగే వారి తల్లిదండ్రులకు కూడా పొగాకు వల్ల జరిగే దుష్పరిణామాలను వివరించాలని తెలియజేశారు.అనంతరం విద్యార్థులచే పొగాకు ఉత్పత్తులు వద్దు - ఆరోగ్యం ముద్దు ; పొగాకు నమలవద్దు - అనారోగ్యం పాలు కావద్దు అని ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేయించి పొగాకు సంబంధిత మత్తు పదార్థాల జోలికి వెళ్ళమని ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాలమ్మ, లలితమ్మ, సరోజినీ దేవి, శంషాద్ బేగం,వెంకటరమణ, మల్లికార్జున రెడ్డి, నాగశేషులు, రామిరెడ్డి, ఫిజికల్ డైరక్టర్ శ్రీనాథ్ పెరుమాళ్ళ బోధనేతర సిబ్బంది మురళీకృష్ణ, పాములేటమ్మ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులు పొగాకు సంబంధిత వ్యసనాలకు దూరంగా ఉండాలి : ప్రధానోపాధ్యాయులు సలీం భాష

## మోడల్ స్కూల్ పిల్లలకు సీజనల్ వ్యాధుల గురించి చెప్పడం జరిగినది



సి బెలగల్ మండలంలోని డాక్టర్ మిథున్ కుమార్ రెడ్డి సీజనల్ వ్యాధుల గురించి మోడల్ స్కూల్ పిల్లలకు సీజనల్ వ్యాధులలో డయేరియా వాంతులు పేదలు, డెంగ్యూ మలేరియా టైఫాయిడ్ వ్యాధులు గురించి చెప్పడం జరిగింది ఇందులో చెప్పిన విషయము బాత్రూం పోయి వచ్చిన తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలి అన్నం తినక ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలి వేడి కాచి పొడపోసిన నీటినే తాగాలి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి వ్యక్తిగత పరిశుభ్రత గురించి చెప్పడం జరిగినది దోమల వలన వచ్చే వ్యాధుల గురించి చెప్పడం జరిగింది ఎందుకు సబ్ యూనిట్ ఆఫీసర్ రంగస్వామి పీహెచ్ఈ హెల్త్ సూపర్వైజర్ కే మద్దిలేటి సి బెళగల్ ఏఎన్ఎం వై అరుణకుమారి పీహెచ్ ఎంపిహెచ్పివై ప్రభావతి ఆశలు పాల్గొన్నారు

## గొల్లల దొడ్డి గ్రామం లో పంటల పరిశీలన.



సి.బెళగల్ మండలంలోని గొల్లలదొడ్డి సి బెలగల్ గ్రామ పరిధిలో మండల వ్యవసాయ అధికారి మల్లేష్ కుమార్ గారు పంటలను పత్తి, కొర్ర, కంది, వేరుశనగ పంటలను వ్యవసాయ అధికారి గారు పరిశీలించడం జరిగింది. పత్తి పంటలో ప్రస్తుతం రసం పీల్చే పురుగు ఉధృతిని గమనించారు. దీనికి నివారణగా ఒక లీటర్ నీటికి అసిటామ ప్రైడ్ 2 గ్రాములు చొప్పున అదేవిధంగా మోనోక్రోటోఫాస్ ఒక లీటర్ నీటికి 2 ఎశ్రీ మరియు వేప నూనె కషాయంను ఒక లీటర్ నీటికి రెండు ఎంఎల్ నిష్పత్తిలో కలుపుకొని పిచికారి చేసుకోవాలని తెలియజేశారు .పత్తిలో ముఖ్యంగా రసం పీల్చుపురుగులు గులాబి రంగు పురుగు ఉధృతిని గమనించడానికి ఎకరాకు 4 లేదా లింగాకర్షణ బుట్టలను అమర్చుకోవాలని తెలియజేశారు. అనంతరం రైతులతో వ్యవసాయ అధికారి గారు మాట్లాడుతూ గ్రామంలోని ఎవరైనా భూమి సాగు చేస్తూ భూమిలేని రైతులు ఉన్న యెడల వారు కౌలు పత్రం పొందుతే వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తిస్తాయని వ్యవసాయ అధికారి గారు తెలియజేశారు .ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది శశికాంత్ మరియు ఎంపీఇ ఓ వెంకటేశ్వర్లు రైతులు కొండన్న, మనోజ్ కుమార్ గారు పాల్గొన్నారు.

## ఎత్తిపోతల పథకం పేస్ -1 నుండి నీటిని విడుదలచేసిన:- ఎమ్మెల్యే గిత్త జయసూర్య





నందికొట్కూరు := నందికొట్కూరు మండలంలోని నాగటూరుగ్రామం ఎత్తిపోతల పథకం పేస్- వన్ నుంచి మంగళవారం ఎమ్మెల్యే గిత్త జయసూర్య నీటినివిడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ఎప్పుడు నీటిని విడుదల చేస్తారో రైతులకు తెలిసేది కాదన్నారు. అదేవిధంగా జులై నెల నుండి నీటిని విడుదల చేసే దాఖలు లేవన్నారు.రైతులునీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి, కొణిదెల సర్పంచ్ కొంగర నవీన్, ఉప సర్పంచ్ భాస్కర్ రెడ్డి, ఓబుల్ రెడ్డి, టిడిపి టౌన్ క్లస్టర్ ఇంచార్జ్ ముత్తు జావలి, మల్లికార్జున్ రెడ్డి, ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ లింగాల స్వాములు, లక్ష్మాపురం మద్దిలేటి గౌడ్, బ్రహ్మానంద రెడ్డి,వాసు రెడ్డి,దామోదర్ రెడ్డి, నరసింహారెడ్డి, జంగాల లక్ష్మన్న, మద్దిలేటి, సురేష్,తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.



EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJITHA PRINTERS, H.NO: 46/801, BUDHAWARAPETA, KURNOOL DIST. - 518001, ANDHRA PRADESH, INDIA. PUBLISHED AT H.NO: 43/217A, N R PETA, KURNOOL DIST., ANDHRA PRADESH, INDIA. EDITOR : PERUMALLA CHENNAKESHAVULU.RNI No : APTEL 2020/80757